## ఎట్టకేలకు ఇళ్లకు చేరిన విద్యార్థులు

**సోషల్ మీడియా ప్రభావం వల్లే :డిఐజి రవిప్రకాష్**



తిరుపతి క్రైం, నవంబర్ 15, ప్రభాతవార్త

తిరుపతిలో పారిపోయిన ఐదుగురు విద్యార్థులు ఎట్టకేలకు ఇళ్లకు చేరారు. సోషల్ మీడియా ప్రభావంతో విద్యార్థులు ఇంటి నుంచి వెళ్లిపోయారని డిఐజి రవి ప్రకాష్ తెలిపారు. అన్నమయ్య స్కూల్లో పదో క్లాస్ చదువుతున్న ముగ్గురు బాలికలు, ఒక్క బాలుడు, 9వ తరగతి చదువుతున్న విద్యార్థి ఈ నెల 9న ఇంటి నుంచి పారిపోయారు. వెస్ట్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మూడు బృందాలుగా పిల్లల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. విద్యార్థులందరూ ఆగ్రాలో ఉన్నట్టు గుర్తించి తిరుపతికి తీసుకువచ్చారు. పోలీస్ విచారణలో నలుగురు విద్యార్థులు ప్రేమించుకున్నారని వారు ఆగ్రాలో స్నేహితుని సహాయంతో అక్కడే వివాహం చేసుకుని జీవించాలని వెళ్లినట్లు తేలింది. సినిమాలు, సోషల్ మీడియా ప్రభావంతో యువతీ యువకులు అనాలోచిత నిర్ణయాలు తీసుకుంటున్నారు. తల్లిదండ్రులు పిల్లల పట్ల అప్రమత్తంగా ఉండాలని డిఐజి సూచించారు.

తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక
వార్త


## బావిలో పడ్డ ఏనుగును సురక్షితంగా రక్షించిన అధికారులు



బంగారుపాళ్యం, నవంబర్ 15 ప్రభాతవార్త:

ఓ వ్యవసాయ బావిలో మంగళవారం తెల్లవారు జామున ఓ ఏనుగు అదుపు తప్పి పడింది. అటవీశాఖ అధికారులు సురక్షితంగా ఆ ఏనుగును వెలుపలికి తీసి అడవిలోకి మళ్ళించారు. ఈ సంఘటన మండలం లోని గాండ్లపల్లి సమీపంలోని పురుషోత్తంనాయుడు వ్యవసాయ బావి వద్ద చోటు చేసుకొంది. మంగళవారం వేకువజామున ఓ ఏనుగుల గుంపు పంటలను ధ్వంసం చేయగా గుంపులోని ఓ ఏనుగు సమీప వ్యవసాయ బావిలో అదుపు తప్పి పడింది. ఉదయం గుర్తించిన రైతులు వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. వెంటనే తిరుపతి అటవీ కన్జర్వేటర్ నాగేశ్వం రావు, డిఎఫ్ఓ చైతన్యకుమార్‌రెడ్డి, పలమనేరు ఎఫ్ఆర్ఓ నయింఆలీ, చిత్తూరు ఎఫ్ఆర్ఓ బాలకృష్ణారెడ్డి, కుప్పం ఎఫ్ఆర్ఓ మదన్‌మోహన్‌రెడ్డి, ఇతర ఫారెస్ట్ అధికారులు వ్యవసాయ బావి వద్దకు చేరుకొన్నారు. జెసిబితో బావికి సమాంతరంగా గోతిని తీయడంతో బావిలో వున్న ఏనుగు తీసిన గోతి గుండా వెలుపలికి వచ్చింది.

## చిత్తూరుతో ఘట్టమనేనికి వీడదీయని బంధం



పాకాలలో రైతు భారతం షూటింగ్ విరామంలో సూపర్‌స్టార్ కృష్ణ



చెన్నై స్టార్ హోటల్‌లో జరిగిన కుమార్తె నిశ్చితార్థంలో కృష్ణ



దిగువమాఘంలో మాజీ ఎంపీ రాజగోపాల్‌నాయుడు స్మారక దినోత్సవంలో పాల్గొన్న సినీ నటుడు కృష్ణ

చిత్తూరు, నవంబర్ 15 ప్రభాతవార్త:

ఉమ్మడి చిత్తూరు జిల్లాతో సీనినటుడు, సూపర్‌స్టార్, మాజీ ఎంపీ ఘట్టమనేని కృష్ణకు విడదీయరాని బంధం నెలకొంది. సీని రంగంలో మకుటంలేని మహారాజుగా, కాంగ్రెస్ ఎంపీగా, నాయకుడిగా జిల్లా వ్యాప్తంగా కృష్ణ పలు కార్యక్రమాలు, సభలు, సమావేశాలకు హాజరయ్యారు. ఘట్టమనేని కృష్ణ తన కుమార్తె పద్మావతి మాజీ మంత్రి గల్లా అరుణకుమారి కుమారుడు గల్లా జయదేవ్‌తో వివాహం జరిపించడంతో ఘట్టమనేని కృష్ణ జిల్లాకు వియ్యంకుడు అయ్యారు. సీని రంగంలో అగ్రగామి హీరోగా కృష్ణ వెలిగే రోజుల్లో 1972 సంవత్సరంలో చిత్తూరులోని ప్రస్తుత పిసిఆర్ ప్రభుత్వ పాఠశాల అప్పటి బోర్డు పాఠశాలలో చిత్తూరుకు చెందిన సిద్ధయ్యమూర్తి ప్రారంభించిన 'భూదేవి' పక్ష పత్రిక వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొనడానికి వచ్చారు. అప్పట్లో సీని నటుడిగా అగ్రస్థానంలో వున్న కృష్ణను చూడటానికి ప్రజలు ఎగబడ్డారు. 1974 సంవత్సరంలో తెలుగు సినీ చరిత్రలో కృష్ణ నటించిన అల్లూరి సీతారామరాజు సినిమా రికార్డు సృష్టించింది. ఆపై విడుదలైన కృష్ణ సినిమాలు వరుసగా ఫ్లాప్ కావడంతో కృష్ణ 1976లో సొంత బ్యానర్‌పై పాడి పంటలు సినిమా నిర్మాణం చేపట్టి విడుదల చేశారు. ఈ సినిమా 1976 జనవరి 13న సంక్రాంతికి విడుదలై సూపర్‌హిట్ అయ్యింది. చిత్తూరులో ఈ సినిమా విజయవంతంగా 50 రోజులు పూర్తి చేసుకొన్న సందర్భంగా సీని నటుడు కృష్ణ చిత్తూరు ప్రతాప్ థియేటర్‌లో జరిగిన ఫంక్షన్‌కు హాజరయ్యారు. ఈ సందర్భంగా చిత్తూరు సినిమా థియేటర్ల యాజమానులు సూపర్‌స్టార్ కృష్ణను జడ్పీ సమావేశభవనంలో సన్మానించారు. ఆపై కృష్ణ పాడిపంటలు సినిమా విజయోత్సవ సభలకు పలమనేరు, మదనపల్లిలకు వెళ్ళారు. ఆపై 1991లో మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ మరణానంతరం జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో చిత్తూరు నుండి పోటీ చేసిన కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఎం.జ్ఞానేంద్రరెడ్డి విజయానికి సీనినటుడు కృష్ణ చిత్తూరు పిసిఆర్ సర్కిల్‌లో జరిగిన ప్రచార సభకు హాజరయ్యారు. ఈ సభకు జనం పోటెత్తారు. అలాగే తవణంపల్లి మండలం దిగువమాఘం గ్రామంలో మాజీ మంత్రి గల్లా అరుణకుమారి తండ్రి రాజగోపాల్‌నాయుడు మృతి చెందిన పదిహేను రోజులకు జరిగిన పెద్ద కర్మకు సీని నటుడు కృష్ణ హాజరయ్యారు. అలాగే అమరరాజా ట్రస్ట్ తరపున సీని నటుడు నాగేశ్వరరావుకు దిగువమాఘంలో సన్మానం చేయాలని నిర్ణయించడంతో ఈ కార్యక్రమంకు నాగేశ్వరరావుతో పాటు కృష్ణ హాజరయ్యారు. 1993 సంవత్సరంలో కృష్ణ నటించిన రైతు భారతం సినిమా షూటింగ్ పాకాల మండలంలో జరిగింది. ఈ సినిమా షూటింగ్ జరిగే వరకు కృష్ణ పాకాలలో వున్నారు. చిత్తూరు జిల్లాలో చరిత్రలో ఇప్పటి వరకు ఏ సినీ హీరోకు లేని విధంగా కృష్ణకు అభిమాన సంఘాలు వున్నాయి. సీని నటుడు కృష్ణపై విపరీతమైన అభిమానం పెంచుకొన్న చిత్తూరుకు చెందిన కెఎన్ రవికుమార్ 1972లో కృష్ణ ఫ్యాన్స్ యూనియన్‌ను స్థాపించి భారీగా సేవా కార్యక్రమాలు చేపట్టారు. కృష్ణ రాజకీయాల్లోకి వచ్చిన అనంతరం కృష్ణ సేన స్థాపించడంతో చిత్తూరు కృష్ణ ఫ్యాన్స్ యూనియన్ కృష్ణ సేనగా రూపాంతరం చెందింది. ఆపై కృష్ణ సేన కృష్ణ ప్రజాశక్తిగా ఆవిర్భావించి ఇప్పటికీ సేవా కార్యక్రమాలు చేపడుతునే వుంది.

## అభిమానులంటే కృష్ణకు ప్రాణం

**-తిరుపతిలో పదికిపైగా అభిమానసంఘాలు**





*తిరుపతి, నవంబర్ 15ప్రభాతవార్త:*

*తెలుగుచిత్ర రంగంలో తనకంటూ ప్రత్యేక ముద్ర వేసుకున్న నటుడు ఘట్టమనేని కృష్ణకు అభిమానులంటే ప్రాణం. దేశంలోనే అత్యధికంగా 2,500అభిమాన సంఘాలు ఉన్న నటుడుగా కృష్ణ సినీప్రపంచాన్ని శాసిం చాడు. తన అభిమానులు ఎప్పుడు వచ్చినా, ఎక్కడ కనిపించినా ఎంతో ఆప్యాయంగా పలకరించి వారి యోగక్షేమాలు ఆయన అడిగి తెలుసుకునేవాడు. తిరుపతిలోనే అత్యధికంగా 10కిపైగా కృష్ణ అభిమాన సంఘాలు ఉన్నాయి. చిత్తూరుజిల్లా కృష్ణ అభిమానసంఘం ప్రధాన కార్యదర్శిగా జొన్నలగడ్డ శంకర్ అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించేవారు. ఆయన మిత్ర బృందం కృష్ణ అభిమాన సంఘం నాయకులు ఎస్‌కె బాబు, అచ్చుల అలియా సుబ్రమణ్యం, పెరుమాళ్ళపల్లి పురుషోత్తంరెడ్డి, ముని, మునికృష్ణ తదితర అభిమాన సంఘం నాయకులు కృష్ణ సినిమాలు విడుదలైతే పండుగ వాతావరణంలా వేడుకలు జరుపుకునే వారు. ఆయన మృతితో మంగళవారం తిరుపతి లక్ష్మీపురం కూడలిలో ఆయన అభిమానులు, కార్పొరేటర్లు ఎస్‌కె బాబు, ఆంజనేయులు మిత్రబృందం కృష్ణ చిత్రపటం ఉంచి నివాళులర్పించారు. తిరుపతికి చెందిన కళాకారుడు, ప్రజా గాయకుడు సోము ఉమాపతి అల్లూరి సీతారామరాజుచిత్రంలోని "తెలుగువీర లేవరా... దీక్షబూని సాగరా.."అంటూ ఆ చిత్రంలోని పాటలు అన్నిటినీ ఆలపించగా కృష్ణ విజయనిర్మల దంపతులు ఆయనను అభినందించి హైదరాబాద్‌కు ఆహ్వానించారు.*

## రక్షించడానికి వచ్చి బలయ్యాడు

**కాదలూరు వద్ద ట్రాక్టర్ బోల్తా - డ్రైవర్ మృతి**



ట్రాక్టర్ కింద పడి మృతిచెందిన శ్రీనివాసులు

తడ, నవంబర్ 15 ప్రభాతవార్త

భారీ వర్షాలు కురిశాయని సంతోషంగా వరినాట్లు వేసుకునేందుకు సిద్ధమైన పొలంలో ప్రమాదం చోటుచేసుకున్న సంఘటన ఇది. దుక్కి దున్నుతున్న ట్రాక్టర్ బురదలో చిక్కుకోగా దాన్ని బయటకు తీసేందుకు వచ్చిన మరో ట్రాక్టర్ డ్రైవర్ ప్రమాదవశాత్తు ప్రాణాలు కోల్పోయాడు. తడ మండలం కాదలూరు సమీపంలో పాములకాలువ ఒడ్డున ఉన్న పొలంలో మంగళవారం సాయంత్రం ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు, ఇక్కడ ఒక రైతుకు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ దుక్కి దున్నుతుండగా బురదలో కూరుకుపోయింది. డ్రైవర్ కూడా ఈ ప్రమాదంలో చిక్కుకొని బయటపడినప్పటికీ ట్రాక్టర్‌ను వెలికి తీసేందుకు మరో ట్రాక్టర్ సాయం తీసుకున్నారు. రెండో ట్రాక్టర్ వచ్చి రోప్‌తో దిగబడిన ట్రాక్టర్‌ను లాగుతుండగా ఈ సారి రక్షించడానికి వచ్చిన ట్రాక్టర్ బురదలో చిక్కుకుంది. ఈ సంఘటనలో ట్రాక్టర్ బోల్తా కొట్టడంతో డ్రైవర్ బురదలో చిక్కుకొని ఊపిరాడక మృతిచెందాడు. సమీపంలోని రైతులు, కూలీలు కొంత ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోయింది. మృతిచెందిన శ్రీనివాసులు (32) వాకాడు మండలం మొనపాలెంకు చెందిన వ్యక్తిగా స్థానికులు తెలిపారు. పొట్ట కూటి కోసం ట్రాక్టర్ డ్రైవర్‌గా ఈ ప్రాంతంలో పనిచేస్తున్నట్లు చెప్పారు. శ్రీనివాసులకు ఆరు నెలల క్రితమే వివాహం జరిగినట్లు తెలిసింది. ఈ సంఘటనతో మొనపాళెం, కాదలూకు సమీప గ్రామాల్లో విషాదఛాయలు అలముకున్నాయి. తడ ఎస్ఐ జె.పి.శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు సంఘటన స్థలానికి వచ్చి శవాన్ని వెలికి తీశారు.

## సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

: డిప్యూటీ సీఎం నారాయణస్వామి



పక్కా గృహాల నిర్మాణ పనుల వద్ద లబ్ధిదారులతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

వెదురుకుప్పం, నవంబర్ 15 ప్రభాతవార్త :

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పరిపాలనలో గడప గడపకు సంక్షేమ పథకాలను రాజకీయాలకు, కులమతాలకు అతీతంగా అందజేయడం జరుగుతుందని రాష్ట్ర డిప్యూటీ సీఎం నారాయణస్వామి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని దిగువపల్లాలు, ఆళ్ళమడుగు పంచాయితీ పరిధిలోని పలు గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహణలో భాగంగా ప్రతి ఇంటి దగ్గర మహిళలతో మాట్లాడి సంక్షేమ పథకాలు అమలు, ప్రయోజనాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు కష్టలు తెలుసుకుని అవసరమైన వసతులు కల్పించే విధంగా పథకాలు రూపకల్పన చేయడం జరుగుతుందన్నారు. జగనన్నకు అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్ళుగా భావించి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని చెప్పారు. రానున్న ఎన్నికల్లో జగనన్నను ఆశీర్వదించాలని కోరారు. పక్కా గృహాలు నిర్మించుకుంటున్న మహిళ లబ్ధిదారులతో మాట్లాడినిర్మాణ పనుల గురించి ప్రశ్నించి తెలుసుకున్నారు. అభివృద్ధి సంక్షేమ పథకాల కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ భారతి, ఎంపీపీ నాగరాణి, జడ్పీటిసి చలం పాళ్యం సుకుమార్, ఎంపిడివో సుధాకర్‌రావు, తహాశీల్దార్ పుల్లా రెడ్డి, రాష్ట్ర వైసీపీ సంయుక్త కార్యదర్శి బండి హేమసుందర్ రెడ్డి, జిల్లా వైసీపీ కార్యదర్శి కామసాని పద్మనాభ రెడ్డి, నాయకులు బట్టే సుబ్రమణ్యం, రామయ్య, రోసు రెడ్డి, ధనంజేయులు రెడ్డి, లోకనాథ రెడ్డి, సురేష్, సచివాలయం సిబ్బంది, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## విశాఖ శారదపీఠాధిపతిచే స్వధర్మ ప్రచార యాత్ర

కుప్పం, నవంబర్ 15 ప్రభాతవార్త



విశాఖ శ్రీ శారద పీఠాధిపతి శ్రీ స్వాత్మానందేంద్ర స్వామి మంగళవారం రాత్రి కుప ్పంలో స్వధర్మ వాహన ప్రచార యాత్రను నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని కోలాటలు, భజన బృందాల ప్రదర్శనల మధ్య మహారథంలో పురవీధుల్లో ఊరేగించారు. స్థానిక పాతపేట చెరువు కట్ట నుంచి నుంచి స్వామివారి యాత్ర ప్రారంభమై కొత్తపేట వరకు కొనసాగింది. కొత్తపేట శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో పాదపూజ, శ్రీ తిరుపతి గంగమాంబ ఆలయంలో మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్ శ్రీమతి శ్రీప్రియ దంపతులచే శ్రీ శారద అమ్మవారికి పీఠ పూజ, అనుగ్రహ భాషణం నిర్వహించారు. అనంతరం సాయిమాతా సేవా ట్రస్ట్‌చే పేదలకు వస్త్రదానం చేశారు. కార్యక్రమంలో వేద బ్రహ్మశ్రీ బాలసుబ్రమణ్యశాస్త్రి, సాయిమాతా సేవా ట్రస్ట్ జగదీష్‌బాబు, శివశంకర్‌తో పాటు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## జగనన్న స్వచ్ఛ సంకల్పం మరింత పటిష్టం

**విధిగా ప్రతి ఇంటి నుండి తడి, పొడి చెత్త సేకరణ**
**ఎంపిడిఓలు, పంచాయతీ సెక్రటరీలతో కలెక్టర్ జూమ్ కాన్ఫరెన్స్**



చిత్తూరు, నవంబర్ 15 ప్రభాతవార్త:

గ్రామాలను పరిశుభ్రంగా వుంచుకోవడానికి ప్రభుత్వ ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమంను మరింత పటిష్టంగా అమలు చేయాలని కలెక్టర్ హరి నారాయణన్ ఎంపిడిఓలు, పంచాయతీ సెక్రటరీలను ఆదేశించారు. కలెక్టర్ హరినారాయణన్ జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీతో కలిసి మంగళవారం కలెక్టరేట్ నుండి ఎంపిడిఓలు, ఇఓఆర్డీలు, పంచాయతీ సెక్రటరీలతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల్లో గ్రీన్ అంబాసిడర్ల ద్వారా తడి, పొడి చెత్తను విడివిడిగా సేకరించి గ్రామాలను పరిశుభ్రంగా వుంచుకోవాలన్నారు. చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలను పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. అలాగే గ్రామాల్లోని నీళ్ళ ట్యాంకులను ప్రతి పదిహేను రోజులకు ఒకసారి శుభ్రం చేయాలన్నారు. ట్యాంకులను శుభ్రం చేస్తున్న ఫోటోలను స్వచ్ఛ సంకల్ప యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. అలాగే గ్రామాల్లో పన్నులు సకాలంలో వసూలు చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే ఊపేక్షించేది లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. ఇఓపిఆర్డీలు గ్రామ స్థాయిలో స్వమిత్ర కార్యక్రమంను వేగవంతం చేయాలన్నారు. జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు 717 గ్రామాల్లో డ్రోన్ సర్వే పూర్తి అయ్యిందని, 95 గ్రామాల్లో రీ-సర్వేకు గాను 9 గ్రామాల్లో ట్రూథింక్ కార్యక్రమం పూర్తి అయ్యిందని కలెక్టర్‌కు వివరించారు.

### ఉష్ణోగ్రతలు

15/11/2022



- తిరుపతి 27 డిగ్రీలు
- చిత్తూరు 29 డిగ్రీలు
- మదనపల్లి 22 డిగ్రీలు
- శ్రీకాళహస్తి 29 డిగ్రీలు
- వెంకటగిరి 29 డిగ్రీలు
- గూడూరు 30 డిగ్రీలు

### బంగారం ధరలు

15/11/2022



22 క్యారెట్స్ 1గ్రాము రూ. 4,940
24క్యారెట్స్ 1గ్రాము రూ.5,389

### కోడిగ్రుడ్ల ధరలు

15/11/2022



కోడిగ్రుడ్డు :రూ.5.00
1 డజను: రూ.60.00

## డి అడిక్షన్ సెంటర్‌ను తనిఖీ చేసిన కమిషనర్



తిరుపతి కార్పొరేషన్, నవంబర్ 15, ప్రభాతవార్త

మత్తు వ్యసనపరుల మార్పుకై స్థానిక కెనడి నగర్‌లో ఏర్పాటు చేసిన మత్తు పదార్థాల వ్యసన నిర్మూలన కేంద్రంను నగర పాలక సంస్థ కమిషనర్ అనుపమ అంజలి మంగళవారం తనిఖీ చేసారు. ఎంత మందికి కౌన్సిలింగ్ ఇస్తున్నారు. ఎంత మంది డాక్టర్లు ఉన్నారు. వ్యసనపరులను ఏ విధంగా గుర్తిస్తున్నారు. ఏ మందులు వాడుతున్నారని అడిగి తెలుసుకున్నారు. ఒక డాక్టర్, ఇద్దరు కౌన్సిలర్లు ఉన్నారని, డి అడిక్షన్ సెంటర్ ఆధ్వర్యంలో నగరంలోని పలుచోట్ల అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని హెల్త్ ఆఫీసర్ డాక్టర్ హరికృష్ణ తెలిపారు. ఈ సెంటర్‌కు ప్రత్యేకంగా ఒక టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు చేయాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. అలాగే మరిన్ని ఎక్కువ క్యాంపులు నిర్వహించి ప్రజల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. ఏ మందులు ఇస్తున్నారు. ఎంత మందికి కౌన్సిలింగ్ ఇస్తున్నారు అనే విషయాలు రికార్డ్ చేసి పెట్టాలన్నారు. ఏఏ మందులు కావాలని ఒక లెటర్ ఇస్తే పై అధికారులకు పంపి తెప్పించుకుందామన్నారు. ఈ సెంటర్ ద్వారా ఎంతో మంది వెలుగులు నింపేలా అందరూ కృషి చేయాలన్నారు. కమిషనర్‌తో పాటు డా. ఆషా, కౌన్సిలర్లు షకిల, పవన్ తదితరులు పాల్గొన్నారు.

## క్రమశిక్షణ తప్పితే చర్యలు తప్పవు

**అలిపిరి పోలీస్‌స్టేషన్‌ను డిఐజి రవి ప్రకాష్ తనిఖీ**



తిరుపతి క్రైం, నవంబర్ 15, ప్రభాతవార్త

ప్రజలు పోలీసులు పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని అనంతపురం రేంజ్ డిఐజి రవి ప్రకాష్ అన్నారు. మంగళవారం తిరుపతి జిల్లా ఎస్పీ పరమేశ్వర్ రెడ్డితో కలిసి డిఐజి తిరుపతి అలిపిరి పోలీస్ స్టేషన్‌లో వార్షిక తనిఖీలు నిర్వహించారు. రికార్డులు పరిశీలించి పోలీస్ పనితీరుపై ఆరా తీశారు. శాంతిభద్రతలకు పెద్దపీట వేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి పోలీస్ సిబ్బంది కర్తవ్యాన్ని చిత్త శుద్ధితో నిర్వహించాలని సూచించారు. తనిఖీలు అనంతరం డిఐజి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుమల తిరుపతి పవిత్ర పుణ్యక్షేత్రంలో భక్తుల ముసుగులో దొంగలు చోరీలకు పాల్పడుతుంటారని దొంగల పై నిఘా ఉంచాలని సూచించారు. గతంలో పోల్చితే అలిపిరి పోలీస్ స్టేషన్ పరిధిలో దొంగతనాలు తగ్గినట్లు తెలిపారు. పోలీస్ స్టేషన్ పరిధిలో భూతగాదాలు అధికంగా ఉన్నాయని చట్టపరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రెవెన్యూ అధికారులు సహాయంతో కేసులను పూర్తి చేయడానికి చర్యలు చేపట్టాలని తెలిపారు. పోలీస్ స్టేషన్ పరిధిలో సుమారు రెండు లక్షల మంది జనాభా ఉన్నారని పోలీస్ సిబ్బంది పనితీరు మెరుగ్గా ఉండాలన్నారు. డయల్ 100కి ఫోన్ చేస్తే ఐదు నిమిషాల్లో పోలీస్ సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీలు కులశేఖర్, విమల కుమారి, ఈస్ట్ డిఎస్పి మురళీకృష్ణ, సిఐ అబ్బన్న, చంద్రశేఖర్, ఎస్ఐలు ఇమ్రాన్, జయచంద్ర, చిన్న రెడ్డప్ప, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

**సైబర్ నేరాలపై అవగాహన...**

మహిళా పోలీసులు సహకారంతో నేరాలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. వాలంటీర్లు సైబర్ నేరాలపై ప్రతి ఇంటికి కరపత్రాలు ఇవ్వడం జరిగిందని తెలిపారు. దీని ద్వారా నకిలీ లోన్ యాప్ ఆగడాలు తగ్గిందన్నారు. మహిళ సంరక్షణ కార్యదర్శి ద్వారా మహిళాపై జరుగుతున్న నేరాలు గురించి తగ్గాయన్నారు.

**కార్పొరేటర్లు పోలీస్‌లకి సహకరించాలి...**

కార్పొరేటర్లు పోలీస్ సిబ్బందికి సహకరించాలని డిఐజి కోరారు. అలిపిరి పోలీస్ స్టేషన్ పరిధిలో కార్పొరేటర్లు ఉమా అజయ్ కుమార్, నరేంద్రనాథ్, అనీష్ రాయల్, వెంకటేష్, అనిల్, రాజేష్ రెడ్డి, డిఐజి నీ మర్యాద పూర్వకంగా కలిశారు. శాంతి భద్రతలపై భూ వివాదాలపై కార్పొరేటర్లతో డిఐజి మాట్లాడారు.

## ట్రాన్స్‌కో ఇన్‌ఛార్జీ ఎఇగా విఎండి కరీముల్లా ఖాన్

గుడిపాల, నవంబర్ 15 ప్రభాతవార్త:

గుడిపాల ట్రాన్స్‌కో ఇన్‌ఛార్జీ ఎఇగా విఎండి కరీముల్లాఖాన్ నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం ఆయన ట్రాన్స్‌కో ఎఇ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇది వరకు గుడిపాల ట్రాన్స్‌కో ఇన్‌ఛార్జీ ఎఇగా విధులు నిర్వహిస్తున్న విశ్వప్రసాద్ సెలవుపై వెళ్ళడంతో ట్రాన్స్‌కో డిఇ అవులకొండ సబ్‌స్టేషన్‌లో సబ్ ఇంజనీర్‌గా విధులు నిర్వహిస్తున్న కరీముల్లాఖాన్‌ను గుడిపాల మండల ఇన్‌ఛార్జీ ఎఇగా నియమించారు. ఇన్‌ఛార్జీ ఎఇగా బాధ్యతలు స్వీకరించిన విఎండి కరీముల్లాను పాపసముద్రం లైన్‌మెన్ బద్రీ, ట్రాన్స్‌కో సిబ్బంది సన్మానించారు.

## రైతు భరోసా కేంద్రాల్లో నానో యూరియా లభ్యం

గుడిపాల, నవంబర్ 15 ప్రభాతవార్త:

మండలంలోని పానాటూరు రైతు భరోసా కేంద్రంలో ఇఫ్‌కో కంపెనీకి చెందిన నానో యూరియా రైతులకు అందుబాటులో వుందని ఎఓ మాధవి పేర్కొన్నారు. 500 మిలీ ధర 240 రూపాయలకు రైతులకు లభిస్తుందన్నారు. ఒక యూరియా బస్తాకు ప్రత్యామ్నాయంగా అర్ధ లీటరు నానో యూనియాను ప్రత్యామ్నాయంగా పిచికారి చేసి రైతులు ఉపయోగించుకోవచ్చునన్నారు.

## సినీ నటుడు కృష్ణ అంత్యక్రియలకు వైకాపా నేతలు

గుడిపాల, నవంబర్ 15 ప్రభాతవార్త:

మృతి చెందిన సినీ నటుడు కృష్ణ అంత్యక్రియలకు గుడిపాల మండల వైకాపా యువనేత సిలంబరసన్ హాజరయ్యారు. హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో సినీ నటుడు కృష్ణ పార్థీవదేహంను అభిమానుల సందర్భనార్థం వుంచారు. ఇక్కడికి వెళ్ళిన గుడిపాల మండల వైకాపా నాయకులు కృష్ణ మృతదేహంకు నివాళులు అర్పించారు.

## విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తి ఉండాలి

బంగారుపాళ్యం, నవంబర్ 15 ప్రభాతవార్త:

విద్యార్థులకు చదువుతో పాటు క్రీడాస్ఫూర్తి పెంపొందించుకోవాలని టేకుమంద జడ్పీ ఉన్నత పాఠశాల హెడ్మాస్టర్ సుభాన్ అన్నారు. మంగళవారం స్థానిక పాఠశాలలో బాలల దినోత్సవంను ఘనంగా నిర్వహించి పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు, షీల్డులు అందజేశారు. అలాగే ఈ పాఠశాలకు చెందిన విద్యార్థిని అస్మిత ఖోఖో జూనియర్స్ విభాగంలో జాతీయ జట్టులో పాల్గొని పాఠశాలకు పేరు తెచ్చారని తెలిపారు. అలాగే రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ పోటీల్లో మరో విద్యార్థి మదన్ జిల్లా జట్టు తరపున ప్రాతినిథ్యం వహించడం పాఠశాలకు గర్వకారణం అన్నారు. వీరితో పాటు చరణ్, వినయ్‌కుమార్, దివ్య, లిఖిత, వర్షిణి, ప్రచోదని విద్యార్థులను మొముంటోలతో ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. అలాగే పిఇటి దేవేంద్రను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు షంషీర్‌ఖాన్, వేణురెడ్డి, రవిచంద్రారెడ్డి, వెంకటస్వామి, విజయకుమారి, జయప్రకాష్, కుసుమ, సుబ్బలక్ష్మీ, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## తవణంపల్లె పోలీస్‌స్టేషన్‌ను డీఎస్పీ తనిఖీ

తవణంపల్లె, నవంబర్ 15 ప్రభాతవార్త:



చిత్తూరు డీఎస్పీ కె.శ్రీనివాసమూర్తి మంగళవారం తవణంపల్లె పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. గత వారం రోజుల క్రితం చిత్తూరు డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాసమూర్తి సాధారణ తనిఖీలో భాగంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా స్టేషన్‌లోని క్రైమ్ రికార్డులు, కేసు డైరీ, రిజిష్టర్‌లను పరిశీలించి అధికారులకు తగు సూచనలు చేశారు. అలాగే పెండింగ్‌లో వున్న కేసులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. డీఎస్పీ వెంట చిత్తూరు రూరల్ వెస్ట్ సీఐ శ్రీనివాసులురెడ్డి, ఎస్సై ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## కుప్పంలో44 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం - ఎమ్మెల్సీ భరత్

- మారనున్న మున్సిపాలిటీ రూపురేఖలు !!



కుప్పం, నవంబర్ 15 ప్రభాతవార్త

కుప్పం మున్సిపాలిటీకి సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి కేటాయించిన 66 కోట్ల నిధుల్లో తొలి విడతగా మున్సిపల్ పరిధిలోని 25 వార్డుల్లో 44. 66కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టినట్లు చిత్తూ రు ఎమ్మెల్సీ, జిల్లా వైకాపా అధ్యక్షుడు భరత్, మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్ పేర్కొన్నారు. మంగ ళవారం మున్సిపాలిటీలోని 25 వార్డుల్లో డ్రైనేజీలు, సిమెంట్ రోడ్ల నిర్మాణాలకు భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి వార్డులో 19.86కోట్ల మేర మురుగునీటి కాలువలు, సిసి రోడ్ల నిర్మాణాలకు వ్యయం చేయనున్నట్లు తెలిపారు. తద్వారా మున్సిపాలిటీ పరిధిలో ప్రధాన సమస్యలు తీరుతాయన్నారు. కార్యక్రమాల్లో రెస్కో ఛైర్మన్ సెంధిల్‌కుమార్, ఎఎంసి ఛైర్మన్ విద్యాసాగర్, మున్సిపల్ వైస్ ఛైర్మన్లు మునస్వామి, హఫీజ్, కమీషనర్ రవిరెడ్డి, వార్డు కౌన్సిలర్లు, కో ఆప్షన్, సలహాకమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ఇంటింటి సర్వే ప్రారంభం

రొంపిచెర్ల,నవంబరు15ప్రభాతవార్త

ఎల్‌సీడీసీ పక్షోత్సవల సందర్భంగా నవంబరు15 నుంచి డిసెంబరు 5 వరకు ఇంటింటికి వెళ్లి కుష్టు రోగులను గుర్తించేందుకు మంగళవారం నుంచి సర్వే ప్రారంభించినట్లు రొంపిచెర్ల పీహెచ్‌సీ వైద్యాధికారి రాజు, డీపీఎంఓ రవిలు తెలిపారు. దీనికి సంబంధించిన శిక్షణ కార్యక్రమం పూర్తయిందని చెప్పారు. ప్రతి ఇంటిని సందర్శించి వ్యాధి లక్షణాలు ఉంటే గుర్తించి పీహెచ్‌సీలకు వారిని తీసుకు వచ్చి పరీక్షలు చేయించి అవసరం అయిన వారికి మందులు ఇవ్వనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలోఆరోగ్య విద్యాదికారి రాజేశ్వరి సీహెచ్‌ఓ కాంతమ్మ పీహెచ్‌ఎన్ పార్వతమ్మ, ఆశా, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

## నాడు నేడు పనులను పూర్తి చేయండి

-అడిషనల్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్



పలమనేరు,నవంబర్ 15,ప్రభాతవార్త:

నాడు నేడు పనులను పూర్తి చేయాలని చిత్తూరు అడిషనల్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ వెంకటరమణారెడ్డి సూ చించారు పలమ నేరు మండంలోని విద్యానగర్ ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న నాడు నేడు పనులను ఆయన మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు నేడు పనులలో నాణ్యత కచ్చితంగా పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారిణి లీలారాణి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన ఉత్సవం

పలమనేరు,నవంబర్ 15 ప్రభాతవార్త:

స్థానిక గ్రంథాలయంలో మంగళవారం పుస్తక ప్రదసర్శన ఉత్సవాన్ని గ్రంథాలయ అధికారి హేమకుమార్ నిర్వహించారు.ఈ మేరకు గ్రంథాలయంలో విద్యార్థులకు సంబంధించిన పోటీ పరీక్షల పుస్తకాలు, నిఘంటువులు,పెద్దలకు పురాణ ఇతిహాస పుస్తకాలు ప్రదర్శంచారు.ఈ ప్రదర్శనకు పలు పాఠశాల విద్యార్థులు,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కుష్టు వ్యాధి నివారణపై అవగాహన

బైరెడ్డిపల్లె,నవంబర్ 15,ప్రభాతవార్త:

కుష్టు వ్యాధి నివారణపై ప్రజలకు మండల వైద్యాధికారులు మంగళవారం అవగాహన కార్యక్రమ నిర్వహించారు. ఆరోగ్య విద్య బోధకురాలు సావిత్రి ఆధ్వర్యంలో మండలంలో ప్రతి ఇంటి వద్ద ప్రజలకు కుష్టు వ్యాధి నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలు,వ్యాధి లక్షణాలు,పరిసరాల పరిశుభ్రతలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది అనురాధ,లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ మద్యం తరలిస్తున్న ఇద్దరు అరెస్ట్

-నాలుగు కేసుల మద్యం, ద్విచక్రవాహనం స్వాధీనం



పెద్దపంజాణి నవంబర్ 15 ప్రభాతవార్త :

కర్ణాటక నుండి అక్రమంగా మద్యం తరలిస్తున్న ఇద్దరిని పంజాణి పోలీసులు అరెస్టు చేసి వారి వద్దనుండి నాలుగు కేసులుకర్ణాటకమద్యం,ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకు న్నారు. ఎస్సై స్వర్ణతేజ కథనం మేరకు... తుర్లపల్లె పంచా యతీ నగేరేపల్లికి చెందిన రామిరెడ్డి కుమారుడు కరుణాకర్ రెడ్డి(29) ,కొలత్తూరు పంచాయతీ గల్లావారిపల్లికి చెందిన శ్రీరాములు కుమారుడు జగపతి(27)లు కర్ణాటక నుండి ఆంధ్రప్రదేశ్‌కు అక్రమంగా మద్యం తరలిస్తు న్నారన్న సమాచారం మేరకు రామాపురం-పెద్దారికుంట సమీపంలోని జాతీయరహదారివద్ద వీరి వాహనాన్ని తనిఖీ చేయగా వారివద్ద నాలుగు కేసులు,సుమారు 192 కర్ణాటక మద్యం(టెట్రా ప్యాకెట్లు) గుర్తించామని తెలిపారు.ఈ మేరకు వారిని అరెస్టుచేసి సుమారు రూ.11500విలువచేసేమద్యం,ఒద్విచక్రవాహనాన్ని సీజ్ చేసి రిమాండుకు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

## వైద్యశాల అభివృద్ధికి భాగస్వామ్యమౌతా

-విశ్రాంత డిఎస్పీ సుకుమార్



పుంగనూరు, నవంబరు 15 ప్రభాతవార్త :

రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చొరవతో అభివృద్ధి పై పు పరుగులు తీస్తున్న వైద్యవిధానపరిషత్తు వైద్యశాలకు మరిన్ని సాయాలందించేందుకు సిద్దంగా ఉన్నానని విశ్రాంత డిఎస్పీ సుకుమార్‌బాబు తెలిపారు. మంగళవారం ఆయన వైద్యశాలకు పదివేల రూపాయల విలువచేసే ఫ్లాస్కులు ఇతర సామాగ్రి వితరణగా అందచేశారు. వైద్యశాల ఛైర్మన్ డాక్టర్ శరణ్‌కుమార్,బిఎంఎస్ క్లబ్ అధ్యక్షుడు సత్యన్నల అధ్వర్యంలో జరిగిన ఈ వితరణ కార్యక్రమంలో డాక్టర్లు,వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

## క్వారీ కూలీలకు జీవిత భద్రత కల్పించాలి

పుంగనూరు, నవంబరు 15 ప్రభాతవార్త :

క్వారీలలో పనిచేసే కూలీలకు జీవిత భద్రత కల్పించాలని సిఐటియు జిల్లా అధ్యక్షుడు వాడగంగ రాజు,గౌరవ అధ్యక్షుడు మురళిలు డిమాండ్‌చేశారు.పాలెంపల్లిలో నరేస్‌కుమార్ అధ్యక్షతన మంగళవారం కూలీల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ క్వారీలు,గ్రానైట్‌లలో పనిచేసే వారికి గుర్తింపు పత్రాలతో పాటూ,వారికి ఇన్సూరెన్సు ఇతర జీవిత భద్రతలను కల్పించి వారికి భరోసాఇవ్వాలన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## కుష్టు వ్యాధి నిర్మూలనకు అందరు సహకరించాలి

సదుం, నవంబరు 15ప్రభాతవార్త



కుష్టు వ్యాధి నిర్మూలనకు అందరు సహకరించాలని చెరకువారిపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి చరణ్ అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్‌సమావేశపు హాలులో కుష్టు వ్యాధి నిర్మూలనకు సంబంధించి ఇంటింట సర్వే చేయడంపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పర్శలేని మచ్చలు, కనుబొమ్మలు రాలిపోవడం, కాళ్ల చేతులు తిమ్మిర్లి వంటి లక్షణాలు ఉంటే సంబంధిత ఆశా కార్యకర్తలకు తెలిపి వారి ద్వారా ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో పరీక్షలు జరిపి వ్యాధి నిర్ధారణ అయిన వారికి ఉచితంగా మందులు ఇవ్వడం జరుగుతుందన్నారు.డాక్టర్ గిరీషా, కమ్యూనిటి వైద్యశాల డాక్టర్ శ్రీధర్, పారామెడికల్ అధికారి ఉదయ్‌భాస్కర్,సీహెచ్‌ఓనీలకంఠ,జానకి, భాగ్యలక్ష్మి, ఆరోగ్య కార్యకర్తలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

## భక్తి శ్రద్ధలతో కార్తీక ఏకాదశి పూజలు

సదుం,నవంబరు15ప్రభాతవార్త

మండల పరిదిలోని పలు దేవాలయాలలో సోమవారం రాత్రి కార్తీక ఏకాదశి పూజలు భక్తి శ్రద్దలతో భక్తులు నిర్వహించారు. స్థానిక కొత్తపల్లెలో శ్రీవెంకటేశ్వరస్వామివారి ఆలయం, నడిగడ్డ మల్లేశ్వరస్వామి వారి ఆలయం, ఎర్రాతివారిపల్లెలోని అయ్యప్ప స్వామి వారి ఆలయం, సదుంలోని శ్రీవీరభద్రస్వామి వారి ఆలయం, సుబ్రమణ్యాస్వామి వారి ఆలయం, బూరగమంద వెంకటేశ్వరస్వామి వారి ఆలయంలలో భక్తులు దీపాలు వెలిగించారు. కేదారనోములు నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయాలను రంగు రంగు విద్యుద్దీపాలతో అలంకరించారు. అన్నదానం ఏర్పాటు చేశారు.

## కోటి 20లక్షలతో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణం

సదుం, నవంబరు 15 ప్రభాతవార్త



మండల పరిదిలోని తాటిగుంటపాలెం పంచాయతీ రాసవారిపల్లెవద్దకొత్తగారూ.కోటి 20లక్షలతో విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మిస్తున్నట్లు జడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు పెద్దిరెడ్డిఅన్నారు.మంగళవారంవిద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి భూమి పూజ చేశారు. నిర్మాణం కోసం బోరువేయించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సహకారంతో మండలానికి కొత్తగా నాలుగు విద్యుత్ సబ్ స్టేషన్లు మంజూరుకావడం సంతోషించదగ్గ విషయం అన్నారు.కార్యక్రమంలో జడ్పీటీసీ సోమశేఖరరెడ్డి, సర్పంచి ఎల్లప్ప,దేవేంద్రరెడ్డి,హరినాధరెడ్డి,రామచంద్రయ్య, ప్రభాకర, వాసు, గిరిరెడ్డి, గ్రామస్థులు పాల్గొన్నారు

## సిమెంటు రోడ్ల నిర్మాణాలు చేపట్టాలి

రొంపిచెర్ల,నవంబరు15ప్రభాతవార్త



మండల పరిదిలోని గ్రామాలలో మిగిలి ఉన్న రోడ్లను సిమెంటు రోడ్లుగా నిర్మాణాలు చేపట్టాలని ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తంరెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు, ప్రజా ప్రతినిధులతో ఆయన అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతు మంత్రి పెద్దిరెడ్డిరా మచంద్రారెడ్డి రెండేళ్ల క్రితం సిమెంటు రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారన్నారు. డిసెంబరులో మంత్రి పర్యటన ఉంటుందని ఆలోపు నిలిచి పోయిన రోడ్ల పనులు వెంటనే పూర్తి చేయాలన్నారు. సమావేశంలో జడ్పీటీసీ రెడ్డీశ్వరరెడ్డి, మంత్రి పిఏ మునితుకారం, ఎంపీడీఓరాజేంద్ర, సింగిల్‌విండో అధ్యక్షుడు హరినాధరెడ్డి, సర్పంచిలు ఇబ్రహీంఖాన్, రమణయ్య, నాగిరెడ్డి,ఎంపీటీసీలు, కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

## దేశాభివృద్ధిలో బాలలే కీలకం

కల్లూరు నవంబరు 15 ప్రభాతవార్త

పులిచెర్ల మండలం కల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గత వారం రోజులుగా విద్యార్థులకు వివిధరకాల పోటీలను నిర్వహించారు. బాలల దినోత్సవం సందర్భంగా ప్రథమ,ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించిన 150 మంది విద్యార్థులకు బహుమతులుపంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు పోకల తాతయ్య, ముత్తూట్ ఫైనాన్స్‌పాకాల, కల్లూరు బ్రాంచి మేనేజర్లు వినయ్‌కుమార్, ఫరీదా, పాఠశాలఅభివృద్ధి కమిటీ ఛైర్మెన్ మహమ్మదరఫిలు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## చెత్త సంపద కేంద్రాల్లో పురోగతి కనిపించాలి

ఓజిలి, నవంబర్ 15 ప్రభాతవార్త



చెత్తసంపద కేంద్రాల చుట్టూ ప్రహరీ నిర్మించి గేటును అమర్చి ఎరువు ఉత్పత్తిని పెంచాలని తిరుపతి జిల్లా పంచాయతీ అధికారి రాజశేఖర్‌రెడ్డిఅధికారులకుసూచించారు.మండలంలోని కురుగొండ గ్రామంలో ఉన్న చెత్త సంపద కేంద్రాన్ని మంగళ వారం జిల్లా పంచాయతీ అధికారి రాజశేఖర్‌రెడ్డి పరిశీలిం చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తరచూ గ్రామాల్లో క్రిమి సంహారక మందులు పిచికారి చేయడంతో పాటు బ్లీచింగ్ చల్లాలన్నారు. గ్రామంలో ప్రతి రోజు ట్రైసైకిల్స్ ద్వారా చెత్తను సేకరించి దాన్ని చెత్తసంపద కేంద్రానికి తరలించి అక్కడ వచ్చిన ఎరువుతో సంపద పొందాలన్నారు.ఎంపీడీఓ రజనీకాంత్, వైసీపీ నాయకులు ముమ్మారెడ్డి ప్రభాకర్‌రెడ్డి, సర్పంచ్ శ్రీలక్ష్మి, ఇన్‌ఛార్జ్ ఈఓపీఆర్‌డీ ఎస్‌కె సిరాజ్, పంచాయతీ కార్యదర్శి టి.రమేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## 17న జగనన్న క్రీడా సంబరాలకు ఎంపిక

తడ, నవంబర్ 15 ప్రభాతవార్త

సూళ్లూరుపేట నియోజకవర్గంలో జగనన్న క్రీడా సంబరాలు-2022కు ఈ నెల 17న ఎంపిక జరుగుతుందని స్పోర్ట్స్ ఆర్గనైజింగ్ సెక్రటరి సన్నాయి భాస్కర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంతకుముందు 13వ తేదీ సెలక్షన్ ఉంటుందని ప్రకటించినప్పటికీ భారీవర్షాల కారణంగా మార్పు చేశారు. డిసెంబర్ 21న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ జన్మదినం సందర్భంగా సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఆధ్వర్యంలో జగనన్న క్రీడా సంబరాలు నిర్వహిస్తామన్నారు. ఇందుకు సంబంధించి 18 సంవత్సరాలు పైబడిన యువతీ యువకులు వాలీబాల్, కబడ్డీ, బ్యాడ్మింటన్ పోటీలకు, యువకులు మాత్రం క్రికెట్ పోటీలకు ఎంపికయ్యేందుకు సూళ్లూరుపేట వీఎస్‌ఎస్‌సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు హాజరు కావాలన్నారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల స్థానికులై ఉండి, ఆధార్‌కార్డు ఆయా క్రీడలకు సంబంధించిన డ్రస్ కోడ్‌ను పాటించాలని సన్నాయి భాస్కర్ పేర్కొన్నారు.

## చెత్త సంపద కేంద్రాలను పరిశీలించిన డీపీఓ

కోట, నవంబర్ 15 ప్రభాతవార్త



కోట మండలం కేశవరం గ్రామంలో మంగళవారం చెత్త సంపద తయారీ కేంద్రాన్ని తిరుపతి జిల్లా పంచాయతీ అధికారి రాజశేఖర్‌రెడ్డి పరిశీలించారు. గ్రామాల్లోని చెత్తను, వ్యర్థ పదార్థాలను తీసుకొచ్చి ఈ కేంద్రాల ద్వారా రైతులకు ఎరువుల రూపంలో దిగుబడి సాధించేందుకు ఎంతో అనుకూలంగా ఉంటుందని చెప్పారు. ఈ సంపద కేంద్రాలను రైతులు చక్కగా ఉపయోగించుకోవాలని కోరారు.ఆయన వెంట ఎంపీ డీఓ భవాని, చిట్టేడు సొసైటీ ఛైర్మన్ ఉలవకాయల ప్రసాద్, ఇన్‌ఛార్జ్ ఈఓపీఆర్‌డీ శ్రీనివాసులు ఉన్నారు.

## 17న కోట మండల మీట్

కోట, నవంబర్ 15 ప్రభాతవార్త

కోట మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 17న జరుగుతుందనిఎంపీడీఓమారెళ్లభవానిమంగళవారంఒక ప్రకటనలో తెలిపారు. అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష ఉంటుందని పేర్కొన్నారు.సమావేశానికి మండలంలోని ఎంపిటిసీలు, సర్పంచులు ఖచ్చితంగా హాజరు కావాలని ఆమె కోరారు.

## డీపీఓకు ఘన సన్మానం

కోట, నవంబర్ 15 ప్రభాతవార్త



కోట మండలం కేశవరం పంచాయతీలో శనివారం విచ్చేసిన తిరుపతి జిల్లా పంచాయతీ అధికారి రాజశేఖర్‌రెడ్డిని చిట్టేడు సొసైటీ ఛైర్మన్ ఉలవకాయల ప్రసాద్ ఘనంగా సన్మానించారు. ఆయన వెంట ఎంపడీఓ భవాని, ఈఓపీఆర్‌డీ శ్రీనివాసులు ఉన్నారు.

## దీపిక మరెన్నో ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

నాయుడుపేట, నవంబర్ 15 ప్రభాతవార్త



చిన్న వయస్సులోనే నాయుడుపేట మున్సిపల్ ఛైర్‌పర్సన్‌గా ఎన్నికైన కటకం దీపిక భవిష్యత్తులో మరెన్నో ఉన్నత పదవులు అధిరోహించాలని వైసీపీ రాష్ట్ర కార్యదర్శి కట్టా సుధాకర్‌రెడ్డి దంపతులు ఆకాంక్షించారు. మంగళవారం కట్టా దీపిక జన్మదినం సందర్భంగా కట్టా సుధాకర్‌రెడ్డితో పాటు ఆయన సతీమణి, నాయుడుపేట జడ్పీటీసీ సభ్యురాలు కట్టా జ్యోతిరెడ్డిలు శుభాకాంక్షలు తెలియజేశారు. నాయుడుపేటలోని మున్సిపల్ ఛైర్‌పర్సన్ కట్టా దీపిక స్వగృహానికి వెళ్లి వారు పుష్పగుచ్చం అందజేసి అభినందించారు.

## ఘనంగా మున్సిపల్ ఛైర్‌పర్సన్ దీపిక జన్మదిన వేడుకలు

నాయుడుపేట, నవంబర్ 15 ప్రభాతవార్త



నాయుడుపేట మున్సిపల్ ఛైర్‌పర్సన్ కటకం దీపిక జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. నాయుడుపేటలోని ఓ కన్వెన్షన్ హాల్లో సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని దీపికకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ చిన్న వయస్సులోనే నాయుడుపేట మున్సిపల్ ఛైర్‌పర్సన్‌గా ఎన్నికైన కటకం దీపిక భవిష్యత్‌లో మరెన్నో ఉన్నత పదవులు అలంకరించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కలికి మాధవరెడ్డి, తంబిరెడ్డి జనార్దన్‌రెడ్డి, బాలచంద్రారెడ్డి, కామిరెడ్డి రాజారెడ్డి, హరిరెడ్డి, మల్లికార్జునరెడ్డి, కిషోర్‌యాద్, ఎంపీపీ కురుగొండ ధనలక్ష్మి, వైస్ ఎంపీపీ 786 రఫీ,వెంకటకృష్ణారెడ్డి,వైసీపీనాయకులు,కార్యకర్తలు,కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## నాయుడుపేటలో సూపర్‌స్టార్ కృష్ణకు ఘన నివాళి

నాయుడుపేట, నవంబర్ 15 ప్రభాతవార్త



నాయుడుపేటలోని నవోదయ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో మంగళవారం సూపర్‌స్టార్ కృష్ణ మృతికి ఘన నివాళి అర్పించారు. నవోదయ పాఠశాల కరస్పాండెంట్ పద్మనాభరెడ్డి ఆధ్వర్యంలో ఆ స్కూలు ఆవరణలో కృష్ణ చిత్రపటాన్ని ఉంచి పూలమాలలు, పూలతో నివాళి అర్పించారు. నటజీవితంలో 350కు పైగా చిత్రాల్లో నటించి చిత్రపరిశ్రమకు కొత్త ఒరవడి తీసుకొచ్చిన నటశేఖర కృష్ణ మృతి దిగ్భ్రాంతికి గురిచేసిందని పద్మనాభరెడ్డి అన్నారు.

## పడకేసిన పారిశుధ్యం - చెత్తాచెదారంతో కంపుకొడుతున్న వీధులు

ఓజిలి, నవంబర్ 15 ప్రభాతవార్త



పల్లెలు పరిశుభ్రంగా ఉంచాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తోంది. పారిశుద్ధ్యం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు అస్తవ్యస్తంగా తయారైంది. ఓజిలి మండలంలోని కర్రబల్లవోలు ఎస్సీ కాలనీలో చెత్తాచెదారంతో వీధులు దర్శనమిస్తున్నాయి. పాలకులు, అధికారులు మాత్రం పంచాయతీరాజ్ చట్టానికి తూట్లు పొడిచే విధంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు అంటున్నారు. ఎక్కడ చూసినా చెత్తాచెదారంతో దుర్వాసన, మురుగునీరు దర్శనమిస్తున్నాయి. దీంతో దోమల ఉత్పత్తి పెరిగిపోతోందని ఆందోళన చెందుతున్నారు. పారిశుద్ధ్యానికి సంబంధించి ఎలాంటి పనులు, దోమల నివారణకు చర్యలు తీసుకోవడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. మురుగు కాలువల్లో క్రిమి సంహాచక పిచికారీ చేయాల్సి ఉన్నా పట్టించుకునే నాథుడే కరవయ్యారని గ్రామస్థులు అంటున్నారు. దీంతో నీరు నిల్వ చేరి చెత్తాచెదారంతో బురద కంపుకొడుతోందని గ్రామస్థులు చెప్తున్నారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు, దోమల బెడద మరింత పెరిగే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. డ్రైనేజీలలో పూడికతీతతో పాటు నీటి నిల్వ కుంటల్లో బ్లీచింగ్, దోమల మందు పిచికారీ తదితర పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. అయితే నిధులు లేవనే సాకుతో అధికారులు, ప్రజాప్రతినిధులు గ్రామాల వైపు కన్నెత్తి కూడా చూడటం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు, పాలకులు దృష్టి పెట్టి పరిష్కార మార్గం చూపాలని ప్రజలు కోరుతున్నారు.

## ఎస్‌డబ్ల్యూపిసి షెడ్డును డిపిఓ ఆకస్మిక తనిఖీ

వాకాడు, నవంబర్ 15, ప్రభాతవార్త



మండల కేంద్రంలోని వాకాడు తుమ్మలగుంట సమీపంలో ఉన్న ఎస్‌డబ్ల్యూపిసి షెడ్డును మంగళవారం తిరుపతి జిల్లా పంచాయితీ అధికారి ప్రభాకర్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేసారు. ఈ సందర్భంగా ఆయన షెడ్డులోని చెత్త నుండి సంపద తయారు చేసే పనులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఎస్‌డబ్ల్యూ పిసి షెడ్డును పూర్తి స్థాయిలో ఎంపిడిఓ గోపినాథ్ ద్వారా వివరాలు తెలుసుకున్నారు. వాకాడు గ్రామంలో ఉన్న ఏరియాలో అన్ని ప్రాంతాలలో పారిశుద్ధ్య పనులపై దృష్టి సారించాలని డిపిఓ ప్రభాకర్ రెడ్డి సంబంధించిన సిబ్బందికి తెలియజేసారు. ప్రభుత్వ లక్ష్యాలను నెరవేర్చే విధంగా చర్యలు తీసుకోవాలని ఈఓపిఆర్‌డి ఉమామహేశ్వర రావుకు సూచించారు. వాకాడు ప్రాంతంలో వీధులు, డ్రైనేజీ, ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉండే విధంగా చేపట్టాలన్నారు. ఆయన వెంట వాకాడు సర్పంచి బండి వెంకటరత్నమ్మ, పంచాయితీ సిబ్బంది తదితరులు ఉన్నారు. అనంతరం ఎస్‌డబ్ల్యూపిసి షెడ్డు వద్ద జిల్లా పంచాయితీ అధికారి ప్రభాకర్ రెడ్డి చేతులు మీదుగా మొక్కను నాటారు.

## ఘనంగా సర్పదోష నివారణ పూజలు

రామకుప్పం, నవంబర్ 15 ప్రభాతవార్త

స్థానిక శ్రీ సుబ్రమణ్యాస్వామి ఆలయంలో మంగళవారం సర్పదోష నివారణ పూజలను ఘనంగా నిర్వహించారు. ఈ పూజలకు ప్రజలు పెద్ద ఎత్తున హాజరై పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. భక్తులకు ఆలయ కమిటీ వారు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

## సీనియర్ నటుడు కృష్ణకు ఘన నివాళులు



కుప్పం, నవంబర్ 15 ప్రభాతవార్త

తెలుగు సినిమా రంగంలో సీనియర్ నటుడు, సూపర్‌స్టార్ కృష్ణకు మంగళవారం కుప్పంలో కృష్ణ, మహేష్‌బాబు అభిమానులు ఘనంగా నివాళులుఅర్పించారు. స్థానిక ఎన్టీఆర్ విగ్రహం వద్ద దివంగత కృష్ణ చిత్రపటానికి పూజలు చేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ చిత్ర పరిశ్రమ పెద్ద దిక్కును కోల్పోయిందన్నారు. కార్యక్రమంలో డా॥ వెంకటేష్, సత్యేంద్రశేఖర్, జెకె సంతోష్, బాబు,చాంద్, డివి భాస్కర్, పిఎస్ సతీష్, నరేష్, యువరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుండాలి - ఎమ్మెల్సీ భరత్

కుప్పం, నవంబర్ 15 ప్రభాతవార్త



ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రజాప్రతినిధులు ముందుండాలని చిత్తూరు ఎమ్మెల్సీ, జిల్లా వైకాపా అధ్యక్షుడు భరత్ సూచించారు. మంగళవారం స్థానిక క్యాంప్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు ప్రతినెలా సమావేశం ఉంటుందన్నారు. ప్రభుత్వ పథకాలపై ప్రజలకు వివరించాలని అలాగే అసత్య ప్రచారాలను తిప్పి కొట్టాలని ఆదేశించారు. మండల కమిటీలు త్వరగా పూర్తి చేయాలన్నారు. సమావేశంలో మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్, ఎఎంసి ఛైర్మన్‌విద్యాసాగర్,సలహాదారు శ్రీనివాసులు, ఎంపిపి అశ్విని, జడ్పీటిసిలు ఎడిఎస్ శరవణ,శ్రీనివాసులు, నేతలు బాబురెడ్డి, దండపాణి, కోదండరెడ్డి పాల్గొన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కాలేజ్‌లో వక్తృత్వ పోటీలు

కుప్పంరూరల్, నవంబర్ 15 ప్రభాతవార్త

జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా ప్రభుత్వ డిగ్రీ కాలేజ్‌లో మంగళవారం మాదక ద్రవ్యాలతో జరుగుతున్న సంఘటనలు,యువతకు ఇచ్చే సూచనలు అనే అంశంపై వక్తృత్వ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో శివరంజని, వేణుగోపాల్, గంగరాజు విజేతలుగా నిలిచారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్‌లక్ష్మీనారాయణ,లైబ్రేరియన్ సత్యవాణి, నాగరాజు, నారాయణమూర్తి, విద్యార్థులు పాల్గొన్నారు.

## హోసూరులో తెదేపా కార్యకర్త మృతి.. చంద్రబాబు సంతాపం

రామకుప్పం, నవంబర్ 15 ప్రభాతవార్త

జీవనోపాధికై తమిళనాడులోని హోసూరు వెళ్లిన మండలంలోని సింగసముద్రంకు చెందిన సుబ్రమణ్యం (30) విద్యుత్‌షాక్‌కు గురైమృతి చెందాడు. ఇతని మృతి పట్ల తెదేపా అధినేత చంద్రబాబునాయుడు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. సుబ్రమణ్యం హోసూరు ప్రాంతంలో టు వీలర్ మెకానిక్‌గా పనిచేసేవాడు. సోమవారం పనుల్లో ఉండగా విద్యుత్‌షాక్‌కు గురై మృతి చెందాడు. మంగళవారం స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. సుబ్రమణ్యం కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని వారు ధైర్యంగా ఉండాలని చంద్రబాబు భరోసా కల్పించారు.

## నేడు ఉచిత గుండె వైద్య శిబిరం

రామకుప్పం, నవంబర్ 15 ప్రభాతవార్త

స్థానిక శ్రీ సుబ్రమణ్యాస్వామి ఆలయం వద్ద నారాయణ హృదయాలయ వారిచే బుధవారం ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు భారతీయ అంబేద్కర్ సేన నేతలు తెలిపారు. ఉదయం 9గంటలనుంచి శిబిరం ప్రారంభం అవుతుందని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## ఎన్టీఆర్ సుజల ప్లాంట్లను వినియోగంలో తేవాలి

శాంతిపురం, నవంబర్ 15 ప్రభాతవార్త



కుప్పం నియోజకవర్గంలో ప్రతి ఒక్కరికీ తాగే ందుకు శుద్ధి చేసిన జలాలు అందించేందుకు మాజీ సిఎం చంద్రబాబునాయుడు నాలుగు మండలాల్లో గతంలో ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా ఏర్పాటుచేసిన ఎన్టీఆర్ సుజల ప్లాంట్లను పదిహేను రోజుల్లోగా వినియోగంలో తేవాలని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు పేర్కొన్నారు. మంగళవారం శాంతిపురంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. 16చోట్ల మదర్ ప్లాంట్లు ఏర్పాటుచేసి బోర్లు డ్రిల్ చేసి 202 గ్రామాల్లో నీటి ట్యాంకులు ఏర్పాటుచేసారని వాటిద్వారా 2రూ.లకే 20లీటర్ల మంచినీరు తీసుకెళ్లేవారన్నారు. అయితే వైకాపా అధికారంలో రాగానే కుప్పంలో ఎన్టీఆర్ సుజలకు పేర్లు మార్చినా నీరు అందించడం లేదన్నారు. ప్రస్తుతం కుప్పంలో పదిహేను చోట్ల, కుప్పం రూరల్‌లో 22చోట్ల, గుడుపల్లెలో 24, శాంతిపురంలో 16, రామకుప్పంలో 25చోట్ల మాత్రమే ట్యాంకులు పనిచేస్తున్నాయని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు తెలిపారన్నారు. 105చోట్ల మాత్రమే సుజల ట్యాంకులు పనిచేస్తుండగా 97 గ్రామాల్లో ఊసేలేకుండా పోయిందన్నారు. ఈ ట్యాంకులను వినియోగంలో తేకుంటే తెదేపా అధ్వర్యంలో ధర్నా చేపడ్తామని హెచ్చరించారు. ఇటీవల వైకాపా సర్పంచులు మంచినీటి బిల్లులకై అమరావతికి బయలుదేరితే పోలీసులు అడ్డుకోవడం ఎంతవరకు సమంజసమన్నారు. అంతకుముందే సర్పంచులు పలువురు మంత్రి సమక్షంలో ధర్నా చేశారన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు విశ్వనాథనాయుడు, సర్పంచ్ జనార్ధనరెడ్డి, నేతలు ఉదయ్‌కుమార్, నాగరాజు, మణి, నాగరాజు, చంద్ర, అనసూయ, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## దళితులను అణిచివేస్తున్న వైసిపి ప్రభుత్వం!

-జరుగుతున్న అన్యాయాలపై 24న 'దళిత శంఖారావం'
-టిడిపి తిరుపతి పార్లమెంట్ అధ్యక్షుడు నరసింహాయాదవ్

తిరుపతి ప్రెస్‌క్లబ్, నవంబర్ 16 ప్రభాతవార్త:
2019లో అధికారంలోకి వచ్చిన నాటి నుండి నేటి వరకు గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్య మంత్రి అయిన తరువాత దళితులపైన దాడులు చేయించడం, వారిపైనే కేసులు పెట్టి వారిని అణచివేసే కార్యక్రమం చేపట్టడం దారుణమని టిడిపి సీనియర్ నేత, తిరుపతి పార్లమెంట్ అధ్యక్షుడు జి.నరసింహయాదవ్ అన్నారు. మంగళవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ జగనన్న కాలనీల పేరుతో ఇళ్లు నిర్మించడానికి ప్రభుత్వ భూములే లేనట్లు దళితుల భూములను దౌర్జన్యంగా ఈ ప్రభుత్వం లాక్కుంది. అది చాలదన్నట్లు ఎస్సీ కార్పొరేషన్ నిధులను



వారికి దక్కకుండా ఇతర పథకాలకు మళ్లించడం దుర్మార్గమన్నారు. గత ప్రభుత్వంలో చంద్రబాబునాయుడు దళితులకు అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. ఈ ప్రభుత్వంలో దళితులకు జరుగుతున్న అన్యాయాలపై నిరసన వ్యక్తం చేస్తూ 'దళిత శంఖారావం' పేరుతో ఈనెల 24వ తేదీ ఉదయం 10-30 గంటలకు రాష్ట్ర ఎస్సీ సెల్ విభాగం ఆధ్వర్యంలో స్థానిక టౌన్‌క్లబ్ వద్ద గల ఎన్టీఆర్ విగ్రహం నుండి ఆర్టీసీ బస్‌స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు కాయం వెంకటరత్నం, రాష్ట్ర మహిళా కార్యదర్శి పి.కుమారిలు మాట్లాడుతూ వైసిపి దళితుల ఓట్లతో గద్దెనెక్కి నేడు ఆ దళితులను అణచివేయడానికిచేస్తున్నకుట్రలుఅన్నీ ఇన్నీ కావ న్నారు. శంఖారావం కార్యక్రమంలోతిరుపతి, చిత్తూరు, అన్నమయ్యజిల్లాల లోని పార్లమెంట్ ఎస్సీ సెల్ఇన్‌ఛార్జిలు, సభ్యులుపాల్గొనిదళితుల స్వరాన్ని వినిపించాలని పిలుపునిచ్చారు. ఈసమావేశంలోటిడిపిదళితనాయకులుపి నాగరాజు, సి.జగ్గయ్య, సుబ్బయ్య, పెంచులయ్య, రేవతి, గంగులయ్య పాల్గొన్నారు.

## శ్రీసిటీలో రక్తదాన శిబిరం..

రక్తదానం చేసిన సెజ్ కంపెనీల ఉద్యోగులు...

శ్రీసిటీ నవంబర్ 15, ప్రభాతవార్త
దేశ వ్యాప్తంగా 'స్వచ్ఛత పక్వాడ' సంబరాల్లో భాగంగా శ్రీసిటీ సెజ్ డీసీ కార్యాలయ అధికారులు మంగళవారం శ్రీసిటీ మరియు నెల్లూరు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీతో కలిసి స్థానిక బిజినెస్ సెంటర్ ఆవరణలో రక్తదాన శిబిరం నిర్వహించారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి సమక్షంలో సెజ్ డెవలప్‌మెంట్ కార్యాలయం స్పెసిఫైడ్ అధికారి ఎస్.మధుబాబు ఈ కార్యక్రమాన్ని లాంచనంగా ప్రారంభించగా అసిస్టెంట్ డెవలప్‌మెంట్ కమిషనర్ డిఎస్ఎన్ రావ్, ఈథరైజ్డ్ ఆఫీసర్ కె.రామారావు ప్రివెంటివ్ ఆఫీసర్ భరత్‌కుమార్ పాల్గొన్నారు. మధుబాబు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన పిలుపు మేరకు 'స్వచ్ఛత పక్వాడ' ప్రచారంలో భాగంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశామన్నారు. స్వచ్ఛంద రక్తదాన ప్రాముఖ్యతను వివరించిన డా.రవీంద్ర సన్నారెడ్డి దాతలందరిని అభినందించారు, ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు సాగిన శిబిరంలో శ్రీసిటీ సెజ్ పరిధిలోని వివిధ పరిశ్రమలకు చెందిన 180 మంది ఉద్యోగులు రక్తదానం చేశారు. రెడ్‌క్రాస్ సొసైటీ పిఆర్ఓ ఎం.మధుసూదన్‌రావు, శ్రీసిటీ ప్రతినిధుల పర్యవేక్షణలో సాగిన ఈ కార్యక్రమంలో శ్రీసిటీ వైస్ ప్రెసిడెంట్ మరేష్‌కుమార్, సెక్యూరిటీ చీఫ్ రమేష్, శ్రీసిటీ ఫౌండేషన్ మేనేజర్ సరేంద్రకుమార్ తదితరులు సాల్గొన్నారు.

## బస్సులను తనిఖీ చేసిన తరువాతే సర్వీస్‌కు ఇవ్వండి!

-గ్యారేజ్ సూపర్‌వైజర్లకు డిపిటిఓ సూచన

తిరుపతి ప్రెస్‌క్లబ్, నవంబర్ 16 ప్రభాతవార్త:
ప్రస్తుతం వర్షాకాలం నడుస్తున్న నేపథ్యంలో ప్రతి బస్సును క్షుణ్ణంగా తనిఖీ చేసిన తరువాతే సర్వీస్‌కు ఇవ్వాలని ఏపిఎస్‌ఆర్టీసీ తిరుపతి జిల్లా ప్రజా రవాణా అధికారి(డిపిటిఓ) తిమ్మాడి చెంగల్‌రెడ్డి గ్యారేజీ సూపర్‌వైజర్లకు సూచించారు. మంగళవారం స్థానిక తిరుపతి డిపోను సందర్శించిన ఆయన డిపో గ్యారేజ్‌లోని బస్సులను అన్ని విధాలుగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్యారేజ్‌లో పనిచేస్తున్న సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజనీర్ జి.నరసింహులు, తిరుపతి డిపో మేనేజర్ టి.బాలాజీలతో పాటు ఇతర గ్యారేజ్ సిబ్బంది పాల్గొన్నారు.

## స్వాతంత్ర్యసమరయోధుడు

"బిర్యాముండ" పేరున అన్నదానం



తిరుపతి, నవంబర్ 15ప్రభాతవార్త:
అటవిక జాతుల నాయకుడు, స్వాతంత్ర్యసమర యోధుడు బిర్యాముండ బ్రిటీష్‌వారితోపోరాటం చేసిన ఘటనలను కొనియాడుతూ బిజెపి నాయకులు జయంతిని జరుపుకున్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటం ఉంచిపుష్పాంజలి ఘటించారు. బిజెపి సాంస్కృతిక విభాగం కన్వీనర్ గుండాల గోపీనాధరెడ్డి ఆధ్వర్యంలో పేదలకు, యాత్రికులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు సుబ్రమణ్యంయాదవ్, కట్టమంచి చంద్రబాబు, అక్కినపల్లి మునికృష్ణయ్యయాదవ్, కొట్టే సుబ్రమణ్యంరెడ్డి, విజయకుమార్, కవిత ,రాజశేఖర్ పాల్గొన్నారు.

## నటుడిగా కృష్ణ ప్రజల మనస్సుల్లో నిలిచిపోతారు

రాయలసీమరంగస్థలి ఘననివాళులు



తిరుపతి, నవంబర్ 15ప్రభాతవార్త:
సినీనటుడుగా ఘట్టమనేని కృష్ణ నిజజీవితంలో ప్రజల మనస్సుల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని రాయలసీమ రంగస్థలి కళాసంస్థ చైర్మన్ గుండాల గోపీనాధరెడ్డి తెలిపారు. ఎన్నో పౌరాణిక చిత్రాలు సూపర్‌స్టార్‌గా ఆయనప్రత్యేక స్థానాన్ని నిలబెటాయని కొనియాడారు. మంగళవారం తిరుపతిలోని రాయలసీమ రంగస్థలి కళాసంస్థ కార్యాలయంలో కృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కళాకారులు కెవిన్ రాజ, విజయకుమార్, ఆదిలక్ష్మి, బత్తయ్య, హిమేష్‌రెడ్డి, మస్తాన్, మల్లారపు రవిప్రసాద్ పాల్గొన్నారు.

## సిజిహెచ్ఎస్ వెల్‌నెస్ కేంద్రం ఏర్పాటుపై

ఎంపిని కలసి కేంద్ర విశ్రాంత ఉద్యోగులు



తిరుపతి, నవంబర్ 15ప్రభాతవార్త:
తిరుపతి నగరంలో కేంద్రప్రభుత్వ కార్యాలయాల్లో సేవలందించి పదవీవిరమణచేసిన విశ్రాంత ఉద్యోగులు మంగళవారం తిరుపతి ఎంపి డాక్టర్ మద్దిల గురుమూర్తిని కలిశారు. మర్యాదపూర్వకంగా కలసిని కేంద్ర విశ్రాంత ఉద్యోగులు తమ ఆరోగ్యంపై వైద్యసౌకర్యాలను పొందడానికి సిజిహెచ్ఎస్ వెల్‌నెస్ కేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు.

## నాయీ బ్రాహ్మణుల సంక్షేమానికి పెద్దపీట వేసింది టిడిపినే!

-తిరుపతి పార్లమెంట్ టిడిపి బిసి సెల్ అధ్యక్షుడు రుద్రకోటి సదాశివం



తిరుపతి, నవంబర్ 15ప్రభాతవార్త:
రాష్ట్రంలోని నాయీ బ్రాహ్మణుల సంక్షేమానికి, వారి అభివృద్ధికి పెద్దపీట వేసింది టిడిపి మాత్రమేనని ఆ పార్టీ తిరుపతి పార్లమెంట్ బిసి సెల్ అధ్యక్షుడు రుద్రకోటి సదాశివం అన్నారు. మంగళవారం విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో జాతీయ నాయీ బ్రాహ్మణ సవితా సమాజం వ్యవస్థాపక అధ్యక్షుడు గుండుపల్లి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రతినిధుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా తిరుపతి పార్లమెంట్ బిసి సెల్ అధ్యక్షుడిగా నియమితులైనందుకు రుద్రకోటి సదాశివంను శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 1089లో అప్పటి ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారకరామారావు నాయీ బ్రాహ్మణ ఫెడరేషన్ స్థాపించి అందరికీ రుణాలు అందించారని గుర్తు చేశారు. దానిని మూడు పర్యాయాలు సిఎంగా పనిచేసిన నారా చంద్రబాబునాయుడు కొనసాగిస్తూ 15 మంది గ్రూపు సభ్యులకు ఒక్కొక్కరికి 2 లక్షలు చొప్పున 30 లక్షలు అందించి నాయీ బ్రాహ్మణుల ఆర్థిక అభివృద్ధికి చేయూత నిచ్చారని కొనియాడారు. ప్రస్తుత వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడున్నరేళ్లు పూర్తవుతున్నా తమ కులానికి ఒక్క రూపాయి కూడా ఇవ్వకపోవడం శోచనీయమన్నారు. టిడిపి హయాంలో నాయీ బ్రాహ్మణుల సంక్షేమానికి అమలుచేసిన జీఓలను అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## ఘనంగా సద్గురు అమేజింగ్ యోగి ఆరాధనా ఉత్సవాలు

తిరుచానూరు, నవంబర్ 16 ప్రభాతవార్త:



తిరుచానూరులోని యోగిమల్లవరంలో నెలకొన్న శ్రీ సద్గురు అమేజింగ్ యోగి, లడ్డు స్వామి 16వ ఆరాధనా ఉత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. 3 రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో భాగంగా ఆరోజు ఉదయం నలుమూలల నుండి వచ్చిన స్వామి శిష్యులు మంగళ వాయిద్యాలనడుమఅభిషేకం, అలంకరణ, హోమం, అర్చన, నైవేద్యం కార్యక్రమాలను పూర్తి చేశారు. మధ్యాహ్నం స్వామి చరిత్ర గురించి భక్తులకు తెలియచేసి, అన్నదాన కార్యక్రమం చేపట్టారు. సాయంత్రం సహస్ర దీపాలంకరణ సేవ, ఏకాంతసేవలను కన్నులపం దువగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సద్గురు శక్తి ఛారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షురాలు పార్వతీ దేవి, ట్రస్ట్ సభ్యులు, సద్గురు సేవాదళ్, భక్త బృందం, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నేడు జిల్లాలో ప్రముఖుల పర్యటనలు, వివిధ కార్యక్రమాలు

తిరుపతిరూరల్, నవంబర్ 15 ప్రభాతవార్త:



జిల్లాలో ప్రముఖుల పర్యటనలతో పాటు వివిధ కార్యక్రమాలు జరగనున్నాయని జిల్లా కలెక్టర్ వెంకట రమణారెడ్డిఒకప్రకటనలోతెలిపారు. అగ్రికల్చర్ కళాశాల విద్యార్థులతో ముఖాముఖీబుధ వారం ఉదయం 8గంటల నుండి 9గంటల వరకు కేంద్ర జలశక్తి మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్, రాష్ట్ర మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డిలు అగ్రికల్చర్ కళాశాల విద్యార్థులతో ముఖాముఖీ కార్యక్రమం నిర్వహించనున్నారు. ప్రాంతీయ రెవెన్యూ సదస్సు బుధవారం ఉదయం 10గంటలకు గ్రాండ్ రిడ్జ్‌లో రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అధ్యక్షతన రెవెన్యూ సదస్సు జరగనున్నది. రాయలసీమ జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, ఆర్డీఓలు, తహాశీల్దార్‌లు పాల్గొంటారు. 17, 18 తేదీలలో సమాచార ధరఖాస్తుదారులకు క్యాంప్ కోర్టుస్థానిక కలెక్టరేట్‌లో ఈనెల 17,18 తేదీలలో రాష్ట్ర సమాచార కమిషనర్ ఉల్చాల హరిప్రసాద్ సమాచార హక్కు చట్టంపై నోటీసులు అందుకున్న ధరఖాస్తుదారులకు క్యాంప్ కోర్టు నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు.

## ప్రజా క్షేమం .. పాడి పంటల సమృద్ధి లక్ష్యంగా "జాతర"

ఎల్లమ్మ ఆలయ మాజీ చైర్మన్ సతీష్‌కుమార్ రెడ్డి



చంద్రగిరి, నవంబర్ 15 ప్రభాతవార్త:
ప్రజల సంక్షేమాన్ని ఆకాంక్షిస్తూ, పాడి పంటలు సమృద్ధి లక్ష్యంగా చంద్రగిరి జాతర వేడుకలు నిర్వహిస్తున్నట్లు శ్రీ మూలస్థాన ఎల్లమ్మ ఆలయ మాజీ చైర్మన్, జాతర వేడుకల కార్యనిర్వాహక పినపెద్ద పాకాల సతీష్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం గ్రామదేవత చెల్లెళ్ళు అయిన నాలుగు గంగమ్మల జాతర పూజాధి కార్యక్రమాలు సంప్రదాయపద్ధతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంఎల్ఏ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి సహాయ సహకారాలతో, అమ్మవారి ఆలయ చైర్మన్ యారాశి చంద్రశేఖర్ రెడ్డి, ఈట పుట్టా రామకృష్ణారెడ్డి పాలకమండలి సభ్యులు, పినపెద్దలు విరూపాక్షి శంకర్ రెడ్డి, మొక్కల రాజారెడ్డి, నామాల శ్రీనివాసులు పర్యవేక్షణలో అమ్మవారి త్రిశూలంను ఊరేగింపుగా మిట్టగంగమ్మ వారి ఆలయానికి తీసుకువచ్చారు. త్రిశూలానికి ప్రత్యేక పూజలు చేశారు. చెవిరెడ్డి రఘునాథరెడ్డి, ఎంపిపి హేమేంద్రకుమార్ రెడ్డి, సర్పంచ్ ముద్దికుప్పం రూప రామమూర్తి, పార్లపల్లి చంద్రశేఖర్ రెడ్డి, పాకాల చంద్రశేఖర్ రెడ్డి, సి.ఎం.కేశవులు, వీరంగారి రమేష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఎంఎల్‌సి ఓటు నమోదుకు తప్పని తిప్పలు

రామచంద్రాపురం, నవంబర్ 15 ప్రభాతవార్త:
పట్టభద్రులు ఎంఎల్‌సి ఓటు నమోదుకు తిప్పలు తప్పడంలేదని టిడిపి చిత్తూరు పార్లమెంటరీ నియోజకవర్గ యూత్ ప్రధాన కార్యదర్శి ముచ్చెలి ఢిల్లీనాథ రెడ్డి అన్నారు. మంగళవారం రామచంద్రాపురంలో ఆయన విలేకరులో మాట్లాడుతూ వృత్తిరీత్యా దూరప్రాంతాలలో గల పట్టభద్రులు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకుని అటెస్టేషన్ కోసం గెజిటెడ్ ఆఫీసర్ల చుట్టూ తిరగాల్సి రావడం ఎంతవరకు సమంజసమన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం పెరిగినందున అభ్యర్థుల సర్టిఫికెట్లు యూనివర్శిటీ, కళాశాలలో ఆన్‌లైన్ ద్వారా పరిశీలించుకోవాలని సూచించారు.

## విఆర్ఓల సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్‌కు వినతి



తిరుపతిరూరల్, నవంబర్ 15 ప్రభాతవార్త:
క్షేత్రస్థాయిలో గ్రామ రెవెన్యూ అధికారులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని వీఆర్వో సంఘ నాయకులు డిమాండ్ చేసారు. గ్రామ రెవెన్యూ అధికారుల రాష్ట్ర సంఘం పిలుపు మేరకు మంగళవారం తిరుపతి కలెక్టరేట్ కలెక్టర్ వెంకట రమణారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేసారు. ప్రభుత్వ కార్యాలయ సమయాల్లో విధులు పూర్తిస్థాయిలో నిర్వహించి, నిర్ణీత సమయంలో పనులు పూర్తి చేస్తామని తెలిపారు. విఆర్వోలకు ప్రభుత్వ సెలవులు ఉపయోగించుకునే విధంగా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు ఉమ్మడి జిల్లా జనరల్ సెక్రటరీ రామానుజపల్లి నాగరాజు, వైస్‌ప్రెసిడెంట్‌నల్లయ్య, ఆర్గనైజింగ్‌సెక్రటరీరాఘవరెడ్డి, తిరుపతిడివిజన్‌ప్రెసిడెంట్ చెంగల్రాయులు, విఆర్వోలు భూపతి, హేమంత్, మల్లిఖార్జునరెడ్డి, సుమన్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

## సత్యనారాయణ స్వామి వ్రతాన్ని జరుపుకున్న చైర్మెన్



శ్రీకాళహస్తి, నవంబర్ 15 ప్రభాతవార్త
శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి చైర్మెన్, సహచర ధర్మకర్తల మండలి సభ్యులు కొందరు పంచారామాల్లో పూజా విధానాలు, అక్కడి పరిపాలనా తీరును పరిశీలించుటకు మూడు రోజుల నుంచి పర్యటిస్తున్నారు. మంగళవారం వారు అన్నవరం సత్యనారాయణస్వామి ఆలయాన్ని సందర్శించారు. అక్కడ వారికి దేవస్థానం అధికారులు పిఆర్ఓ కొండలరావు, తలుపులయ్యలు స్వాగతం పలికారు. వారికి 'సత్యనారాయణస్వామి వ్రతాన్ని'జరిపించుటకు ఏర్పాట్లు చేసారు. వ్రత నిర్వహణ తరువాత స్వామి ఆలయంలో ప్రత్యేక దర్శనం ఏర్పాటు చేసారు. తరువాత వేదపండితులతో ప్రత్యేక ఆశీర్వచనాలు అందించారు. ఆలయ అర్చకులు కోట శ్రీనివాస శర్మ, సర్వరాయశాస్త్రి, శివస్వామి, గంగల పట్నం శ్రీను శర్మ చే ఆశీర్వదించారు. చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు దంపతులతో సభ్యులు కొండూరు సునీత, నరసింహారాజు(నంద)న్యాయవాదిలక్ష్మీపతి, శశి, పియం చంద్ర, జోషి, శర్మ, బాలాగౌడ్, సునీల్, తేజ తదితరులు పాల్గొన్నారు.

## ఎపిఐఐసి భూములను పరిశీలించిన జాయింట్ కలెక్టర్



తొట్టంబేడు, నవంబర్ 15 ప్రభాతవార్త
తిరుపతి జిల్లా జాయింట్ కలెక్టర్ బాలాజీ మంగళవారం మండలంలోని తంగేళ్ళపాళెం పంచాయతీ బసవన్నగుంట గ్రామంలోని సర్వేనంబర్ 257లో 2,3,4లో ఉన్న 14.25ఎకరాల భూమిని పరిశీలించారు. ఇక్కడ గతంలో శ్రీకాళహస్తీశ్వరస్టీల్స్ ప్యాక్టరీ ఉండేది. ఈనేపథ్యంలో ఈభూమిని రద్దుచేయడంతో సంబంధిత భూములను ఎపిఐఐసి అప్పగించేందుకు పర్యవేక్షణ చేశారు. గతంలో ఇక్కడ ఉన్న భూముల వివరాలు, స్టీల్‌ప్యాక్టరీకి సంబందించిన వివరాలను తహాశీల్దార్ సుధీర్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. ఈభూములకు సంబంధించి ఖచ్చితమైన వివరాలు పూర్తిగా పంపాలని జాయింట్ కలెక్టర్ తహాశీల్దార్‌ను ఆదేశించారు. ఎపిఐఐసికి అప్పగించిన తర్వాత ఇక్కడ ఏ పరిశ్రమ వస్తుందో తెలుస్తుంది. జాయింట్ కలెక్టర్‌తో పాటు తహాశీల్దార్ సుధీర్‌రెడ్డి, విఆర్‌ఓలు మువర్ణ, చిట్టిబాబు, సర్వేయర్ మోహనకృష్ణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు మూడు రాజధానులకు మద్దతుగా ర్యాలీ

శ్రీకాళహస్తి, నవంబర్ 15 ప్రభాతవార్త
రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మూడు రాజధానులకు మద్దతుగా మూడు రాజధానులకు మద్దతుగా బుధవారం శ్రీకాళహస్తి పట్టణంలో చేపడుతున్న ర్యాలిని జయప్రదం చేయాలని శాసనసభ్యుడు బియ్యపు మధుసూ ధనరెడ్డి మంగళవారం పిలుపు నిచ్చారు. రాష్ట్రంల సర్వతోముఖాభివృద్ది చెందుటకు యువ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఈ నిర్ణయం తీసుకున్నారని ఎంఎల్ఏ వివరించారు. మన రాష్ట్రం అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందాలన్న మహోన్నత లక్ష్యంతో చేపట్టిన నిర్ణయానికి అందరూ మద్దతు ఇస్తున్నా మన్నారు. తాను గడప గడపకు మన ప్రభుత్వం వెళ్ళినపుడు ప్రజల నుంచి విశేష స్పంద న లభిస్తుంద న్నారు. బుధవారం ఉదయం 10గంటలకు స్థానిక వైయస్ఆర్ సర్కిల్ వద్ద నుంచి ర్యాలి ప్రారంభమౌ తుందని కార్యకర్తలు, నాయకులు, అభిమానులు పార్టీ శ్రేణులు హాజరుకావాలని శాసనసభ్యుడు బియ్యపు మదుసూదనరెడ్డి పిలుపు నిచ్చారు.

## ఏర్పేడులో చోరీ

శ్రీకాళహస్తిరూరల్, నవంబర్ 15 ప్రభాతవార్త
ఏర్పేడు మండల కేంద్రంలోని ఓ ఎలక్ట్రిక్ షాపులో సోమవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు జొరబడి చోరీకి పాల్పడినట్లు మంగళవారం ఉదయం కనుగోన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మండల కేంద్రంలోని ఏర్పేడు-వెంకటగిరి మార్గంలో సిఎంఆర్ ఎలక్ట్రికల్‌షాపులో గుర్తుతెలియని వ్యక్తులు తలుపుల బీగాలు పగుల గొట్టి లోపల జొరబడి చోరీకి పాల్పడ్డారు. షాపులో సుమారు రూ.70వేల విలువ గల విద్యుత్ పరికరాలను, రూ.5వేల నగదును చోరి చేసినట్లు షాపు యజమాని మునిరామిరెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేసారు. సిసి పుటేజీలతో పోలీసులు పరిశీలనలు జరుపుతున్నారు.

## మంగళం ట్రెండ్స్‌లో ఘనంగా 'బాలల దినోత్సవం'

తిరుపతి ప్రెస్‌క్లబ్, నవంబర్ 16 ప్రభాతవార్త:
మంగళవారం స్థానిక మంగళం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల(మంగళం (ట్రెండ్స్) నందు యువతేజం ట్రస్ట్ చైర్మన్ కరీముల్లా మరియు స్ఫూర్తి ఫౌండేషన్ చైర్మన్ హేమశేఖర్‌ల సహకారంతో 'బాలల దినోత్సవ' వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థినీ విద్యార్థులకు జవహర్‌లాల్ నెహ్రూ గురించి, అలాగే 'బాలల దినోత్సవం' ప్రాముఖ్యత గురించి వక్తృత్వ, వ్యాసరచన, శాస్త్రీయ నృత్యం, స్పెల్ బి, నాటకాలు, కోలాటం, శ్లోకాలు, పాటలు వంటి వివిధ పోటీలు నిర్వహించి బహుమతులను ప్రదానం చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కేశవులునాయుడు మాట్లాడుతూ నెహ్రూ 17 ఏళ్లపాటు ప్రధానిగా పనిచేసినా సాధారణ జీవితం గడిపి అందరికీ ఆదర్శప్రాయుడయ్యారని అన్నారు. మెడికల్ ఆఫీసర్ డా॥జగదీష్ మాట్లాడుతూ విద్యార్థులు ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ భావి భారత పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. యువతేజం ట్రస్ట్ చైర్మన్ కరీముల్లా మాట్లాడుతూ విద్యార్థులను మంచి పౌరులుగా తయారు చేసే బృహత్కర బాధ్యతను ఉపాధ్యాయులు స్వీకరించడం పట్ల హర్షం వ్యక్తంచేశారు. స్ఫూర్తి ఫౌండేషన్ చైర్మన్ మేమశేఖర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు ప్రతిభ చూపుతున్న వారికి ఉన్నత చదువుల కోసం తాము ప్రోత్సా హం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, భోదనేతర సిబ్బంది, యువతేజం ట్రస్ట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రసన్న, విద్యా కమిటీ చైర్మన్, సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## విద్యార్థులు క్రమశిక్షణతోనే ఉన్నత లక్ష్యాలను సాధించగలరు

తిరుపతి (విద్య), నవంబర్ 15, ప్రభాతవార్త
విద్యార్థులు క్రమశిక్షణతోనే ఉన్నత లక్ష్యాలను చేరుకుంటారని ఎస్ఎంపి ఎస్జి మంగాపురం నారాయణ క్యాంపస్ స్కూల్ ప్రిన్సిపల్ తులసి పేర్కొన్నారు. మంగాపురంలోని ఎస్ఎంపి ఎస్జి నారాయణ క్యాంపస్ స్కూల్ వైస్ ప్రిన్సిపల్ వింధ్య త్రిశల ఆధ్వర్యంలో బాలల దినోత్సవం సందర్భాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు వక్తృత్వం, వ్యాసరచన, క్రీడా పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ప్రిన్సిపల్ తులసి మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో, పట్టుదలతో, నిరంతరం పరిశ్రమిస్తే ఉన్నత లక్ష్యాలను చేరుకుంటారన్నారు.

## రికార్డులు సక్రమంగా లేకుండా నడిపితే చర్యలు : సిఐ

నారాయణవనం, నవంబర్ 15 ప్రభాతవార్త :
పుత్తూరు రూరల్ సర్కిల్ పరిధిలోని నారాయణవనం, పిచ్చాటూరు, కెవిబిపురం మండలాలకు చెందిన వాహనచోదకులు రోడ్డుపైకి వాహనాలను తీసుకొని వచ్చేటప్పుడు తప్పకుండా వాటికి సంబంధించిన అన్ని రకాల రికార్డులను కలిగి వుండాలని, అలాగే డ్రైవింగ్ లైసెన్స్ కూడా తప్పక కలిగి వుండాలని పుత్తూరు రూరల్ సిఐ సురేష్‌కుమార్ తెలిపారు. నారాయణవనం మండలం సిద్దార్థ ఇంజనీరింగ్ కళాశాల వద్ద మంగళవారం సాయంత్రం పుత్తూరు-చెన్నై మార్గంలో నడిచే ప్రతి వాహనాన్ని క్షణంగా తనిఖీ చేశారు. తనిఖీలో ఎఎస్ఐ జయరాంనాయక్, సిబ్బంది గోపి, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## నాటు సారా తయారీపై ఎస్ఇబి అధికారులు దాడి



నారాయణవనం, నవంబర్ 15 ప్రభాతవార్త :
మండలంలోని కశింమిట్ట పంచాయతీ కశింమిట్ట యానాధికాలనీకి సమీపంలో నాటు సారాయి తయారీకి సిద్దంగా వుంచిన సుమారు 200 లీటర్ల ఊటను ధ్వంసం చేసినట్టు పుత్తూరు ఎస్ఇబి సిఐ కృష్ణ, ఎస్ఐ నాగరాజు తెలిపారు. వారు మాట్లాడుతూ తమకు వచ్చిన సమాచారం మేరకు మంగళవారం తిరుపతి డిటిఎఫ్, పుత్తూరు ఎస్ఇబి సిబ్బందితో కలిసి దాడులు చేయగా ఊటను గుర్తించి ధ్వంసం చేశామన్నారు. ఈ ఊట భీమునిచెరువుకు చెందిన ప్రసాద్‌గా గుర్తించి ఆయనపై కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. ఈదాడిలోడిటిఎఫ్‌హెడ్‌కానిస్టేబుల్ ఎ ధర్మయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రామ వార్డుమెంబర్ మృతికి పలువురు సంతాపం



నారాయణవనం, నవంబర్ 15 ప్రభాతవార్త :
మండలంలోని దిగువకనకపాలెం పంచాయతీకి చెందిన గ్రామ వార్డు మెంబర్ భాస్కర్(40) మంగళవారం ఉదయం మృతి చెందాడు. ఆయనకు భార్య పిల్లలు వున్నారు. వైకాపా పార్టీ కోసం ఆయన చేసిన సేవలను గుర్తించి సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, అతని తనయుడు, జడ్పీ ఫైనాన్స్ కమిటీ మెంబర్ కోనేటి సుమన్‌కుమార్ ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఆయనతో పాటు డిసిసిబి డైరెక్టర్ ఊరప్ప, సర్పంచులు స్వర్ణ, గుణశేఖర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## గ్రంథాలయ వారోత్సవాలు



పుత్తూరురూరల్, నవంబరు 15 ప్రభాతవార్త:
పుత్తూరులో చిత్తూరు గ్రంథాలయ సంస్థ చైర్మన్ నైనారు మధుబాల 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ గ్రంథాలయంలో పోటీల పరీక్షలకు సంబంధించి పుస్తకాలు, బాల సాహిత్యం, సైన్స్, విజ్ఞాన సంబంధిత పుస్తకాలు, దేశ నాయకుల జీవిత చరిత్రలు, దేశ చరిత్రలకు సంబంధించిన పలు పుస్తకాలు, నవలలు, ప్రదర్శనలో ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగులు శంకరయ్య, సుధాకర్‌రాజు, శంకర్‌రాజు, లక్ష్మిపతి, శేఖర్‌రాజు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## పుస్తక పఠనంతోనే విజ్ఞానం



వడమాలపేట, నవంబరు 15 ప్రభాతవార్త:
పుస్తకాలను ఎక్కువగా చదవడం వల్ల విజ్ఞానాన్ని పెంచుకో వచ్చునని వడమాలపేట గ్రంథాలయ అధికారి దాక్షాయణి పేర్కొన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం విద్యార్థులచే పుస్తక పఠనం కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు అవసరమైన అన్ని పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని ఆమె తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## విద్యార్థులు క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలి - విష్ణువర్ధని

రేణిగుంట, నవంబరు 15 ప్రభాతవార్త:
విద్యార్థులు క్రీడలు పట్ల ఆసక్తి పెంచుకోవాలని రేణిగుంట బాలికల ఉన్నత పాఠశాల ప్రధానాచార్యులు విష్ణువర్ధని అన్నారు. రేణిగుంట బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం జిల్లా స్థాయి బాలికల రెజ్లింగ్ పోటీలకు క్రీడాకారులను ఎంపికచేశారు. చిత్తూరు జిల్లా నుంచి 150 మంది క్రీడాకారులు వచ్చారు. అండర్ 14, అండర్ 17 జట్లను ఎంపిక చేశారు. వీరంతా జిల్లాస్థాయిలో గెలుపొంది రాష్ట్ర స్థాయిలో ఆడాలని విష్ణువర్ధని అన్నారు. చిత్తూరు జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఎంపికలు జరిగినట్లు తెలిపారు. ఎంపిక చేసిన వారిలో కార్యదర్శులు బాబు, సురేష్, రాష్ట్ర గ్రాబ్లింగ్, రెజ్లింగ్ అధ్యక్షుడు సురేంద్రరెడ్డి, పీడీలు రామకృష్ణ, శ్రీధర్, రేఖారాణి, సాయి సుమతి, ప్రసన్న, రోహిణి తదితరులు ఉన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

రేణిగుంట, నవంబరు 15 ప్రభాతవార్త:
నాయుడుపేట-పూతలపట్టు జాతీయ రహదారిపై రేణిగుంట మండలం గురవరాజుపల్లి వద్ద మంగళవారం ఉదయం జరిగినరోడ్డు ప్రమాదంలో పోలయ్య(45) తీవ్రంగా గాయపడ్డాడు. కరకంబాడికిచెందిన పోలయ్య ద్విచక్రవాహనంలో శ్రీకాళహస్తి వైపు వెళుతుండగా గురవరాజుపల్లి వద్ద గుర్తు తెలియని వాహనం వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో అతను తీవ్రంగా గాయపడ్డాడు. ఆ ప్రాంతానికి వెళుతున్నసీనియర్‌పాత్రికేయుడు చందు హుటాహుటిన క్షతగాత్రున్ని 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం రుయాకుపంపాడు. సమాచారాన్నిపోలీసులకు, కుటుంబసభ్యులకుతెలియజేసి మానవత్వాన్ని చాటుకున్నాడు.

## సమస్యలను అధికారులు వెంటనే పరిష్కరించాలి

- బియ్యపు పవిత్రరెడ్డి



రేణిగుంట, నవంబరు 15 ప్రభాతవార్త:
గడప గడపకు ప్రభుత్వంలో భాగంగా ప్రజలు తెలియజేసిన సమస్యలను అధికారులు వెంటనే పరిష్కరించకపోతే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తోందని రేణిగుంట మండల వైకాపా ఇన్‌చార్జి బియ్యపు పవిత్ర రెడ్డి అన్నారు. రేణిగుంట మండలంలోని కృష్ణాపురం, మల్లవరం, కరకంబాడి సచివాలయ పరిధిలోని గ్రామాల్లో ఎంపీపీ హరిప్రసాద్‌రెడ్డితో కలసి మంగళవారం పవిత్రరెడ్డి విస్తృతంగా పర్యటించారు. ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను ఎంత వరకు పరిష్కరించారో అటు ప్రజలను, ఇటు అధికారులను అడిగి తెలుసుకున్నారు. పరిష్కారం కాని సమస్యలను వెంటనే ఉన్నతాధికారులు చర్చించి పరిష్కరించాల్సిందిగా సూచించారు. ఆమెతో పాటు గ్రామ పంచాయతీలసర్పంచ్‌లు, వార్డు మెంబర్లు, కార్యదర్శులు, వలంటీర్లు, పలువురు వైకాపా నేతలు ఉన్నారు.

## పుస్తకాలు చదవాలి జ్ఞాపక శక్తి పెంచుకోవాలి - సుజాత

రేణిగుంట, నవంబరు 15 ప్రభాతవార్త:
విధిగా పుస్తకాలు చదివి జ్ఞాపకశక్తిని పెంచుకోవాలని రేణిగుంట వైస్‌ఎంపీపీ సుజాత పిలుపునిచ్చారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం స్థానిక లైబ్రరరీ వద్ద పుస్తక ప్రదర్శనాలను వైస్ ఎంపీపీ సుజాత ప్రారంభించారు. 1వ తరగతి విద్యార్థులకు అర్థమయ్యే వర్ణమాల పుస్తకాల మొదలు మహా మేధావులుచదివేగ్రంథాలవరకుప్రదర్శనలోఉంచారు. ప్రారంభోత్సవలైబ్రరరీ అధికారి శ్రీముఖి, ప్రధానోపాధ్యాయులుమునిరత్నం, మహబూబ్ బాషా, పలువురు వార్డు మెంబర్లు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## లాభసాటి పంటలను ఎంచుకోవాలి - శ్రీనివాసులు

రేణిగుంట, నవంబరు 15 ప్రభాతవార్త:
రైతులు వాతావరణ పరిస్థితులకు అనుకూలంగా లాభసాటి పంటలను ఎంచుకుని వ్యవసాయం చేసినప్పుడే అధిక లాభాలు పొందగలుగుతారని రాస్ కృషి విజ్ఞాన కేంద్రం హెడ్ సీనియర్ శాస్త్రవేత్త శ్రీనివాస్ అన్నారు. రేణిగుంట మండలం కరకంబాడి పంచాయతీ చైతన్యపురం రాస్ కృషి విజ్ఞాన కేంద్రాన్ని మంగళవారం తమిళనాడు రాష్ట్రానికి చెందిన పలు రైతులు సందర్శించారు. కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు ఆత్మసంస్థ సహకారంతో వివిధ రకాల పంటలపైన అవగాహన కల్పించారు. రైతులకు అవగాహన కల్పించిన వారిలో శాస్త్రవేత్తలు శ్రీలత, పద్మజ, సుధాకర్, దివ్య, రాముకుమార్, ఆత్మ ప్రతినిధులు మునస్వామి, అరవింద్ తదితరులు ఉన్నారు.

## అజాతశత్రువు సూపర్ స్టార్ కృష్ణ - వీఆర్ రావణన్



రేణిగుంట, నవంబరు 15 ప్రభాతవార్త:
సినీ రంగ ప్రముఖుడు, ప్రముఖ కాంగ్రెస్ వాది సూపర్‌స్టార్ కృష్ణ ఆకస్మిక మరణం ఎంతో బాధ కలిగించిందని రేణిగుంట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వి.ఆర్.రావణన్ అన్నారు. రేణిగుంట గాంధీ బొమ్మ సెంటర్‌లో మంగళవారం మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సూపర్ స్టార్ కృష్ణకు ఘనంగా నివాళులర్పించారు. ఆయన చిత్రపటానికి రావణన్ పూలమాలలు వేసి మౌనం పాటించారు.

ఆర్‌జీటీ6: సూపర్ స్టార్ కృష్ణకు నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ నేతలు

## జ్ఞానసముపార్జన భాండాగారాలు "మన గ్రంథాలయాలు"

చంద్రగిరి సర్పంచ్ ముద్దికుప్పం రూపరామమూర్తి



చంద్రగిరి, నవంబర్ 15 ప్రభాతవార్త:
మనిషి దైనందిన జీవితంలో వ్యక్తిగత, వ్యవస్థాగత పురోభివృద్ధికి దోహదపడగల జ్ఞానసముపార్జన భాండా గారాలు మన గ్రంథాలయాలని సర్పంచ్ ముద్దికుప్పం రూప రామమూర్తి అన్నారు. స్థానిక పాతపేటలోని గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి రెడ్డెమ్మ ఆధ్వర్యంలో వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన సర్పంచ్ పుస్తక ప్రదర్శనను ప్రారంభించారు. మాట్లాడుతూ పుస్తక పఠనం మేధోసంపత్తిని పెంపొందిపజేస్తుందన్నారు. అతకుముందు గ్రంథాలయ అధికారి రెడ్డెమ్మ పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాతపేట, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం రామిరెడ్డి, సిబ్బంది రమాదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

# విద్యార్థులు క్రమశిక్షణతోనే లక్ష్య సాధన



తిరుపతినగరం, నవంబర్ 15 ప్రభాతవార్త : శ్రీ పద్మావతి మహిళా వైద్య కళాశాలలో అడ్మిషన్లు పొందిన విద్యార్థిలు క్రమశిక్షణతో వైద్య విద్యను అభ్యసించి, తమ లక్ష్యాలను తామే నిర్దేశించుకుని వారి సాధన కొరకు కృషి చేయాలని స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ బి.వెంగమ్మ అన్నారు. మంగళవారం వైద్య విద్యార్థినులు, వారి తల్లిదండ్రులకు వైద్య కళాశాల నందు బోధనా పద్ధతులపై ప్రత్యేక అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించినట్లు మెడికల్ సూపరిన్ టెండెంట్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ బి.వెంగమ్మ, డీన్ డాక్టర్ అల్లాడి మోహన్, శ్రీ పద్మావతి మహిళా వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శరణ్ బి సింగ్, డాక్టర్ ముక్తేశ్వర్య, డాక్టర్ అపర్ణబిట్ల, డాక్టర్ ఉమామహేశ్వరరావు, డాక్టర్ వాసుదేవ రెడ్డిలు సంయుక్తంగా జ్యోతిని వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ వైద్య విద్యార్థినులు విద్యతో పాటుగా అధ్యాత్మికంగా, శారీరకంగా, మానసికంగా ధృడత్వాన్ని పెంపొందించు కోవాలన్నారు. వైద్య విద్యను అభ్యసించడంలో ఎటువంటి భయాందోళనలకు లోనుకాకుండా, ప్రశాంతంగా విద్యను విజయవంతంగా పూర్తిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో 120 మంది విద్యార్థినీలు జూమ్ ద్వారా పాల్గొన్నారు. కమ్యూనిటీ విభాగాధిపతి డాక్టర్ నాగరాజు, బయోకెమిస్ట్రీ ప్రొఫెసర్ డాక్టర్ సుచరిత, డాక్టర్ ప్రతిభ, డాక్టర్ అంజు డి విద్యార్థినులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఎపి ఎన్జీవో నూతన కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవం

-అధ్యక్షుడుగా చెంచురత్నంయాదవ్



శ్రీకాళహస్తి, నవంబర్ 15 ప్రభాతవార్త

ఏపి ఎన్జీవో అసోసియేషన్ శ్రీకాళహస్తి తాలూకా నూతన కార్యవర్గంను మంగళవారం స్థానిక ఎన్జీవో హోంలో జరిగిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా సి.చెంచురత్నంయాదవ్ (పంచాయతీరాజ్‌శాఖ), అసోసియేట్ అధ్యక్షులుగా పిఎంవి.నారాయణరెడ్డి(మున్సిపల్‌శాఖ), ఉపాధ్యక్షులుగా ఆర్.జనార్ధన్(పంచాయతీరాజ్‌శాఖ), ఎం.తాతాబాయ్ (వైద్యశాఖ), జి.సురేష్‌కుమార్(వైద్యశాఖ), కార్యదర్శిగా సి.నాగరాజు, సంయుక్త కార్యదర్శులుగా బి.బాలచంద్రయ్య, ఆర్.బాలాజీ, పి.గోవింద స్వామి, బి.లక్ష్మి, ట్రెజరర్‌గా వి.సురేష్‌రెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని పలువురు అభినందించారు. ఎన్నికల అధికారిగా సురేష్‌బాబు, అసిస్టెంట్ ఎన్నికల అధికారిగా శ్రీనివాసులు, పరిశీలకులుగా ప్రదీప్‌లు వ్యవహరించారు.

# తిరుపతిరూరల్లో దర్జాగా భూ ఆక్రమణలు

-స్వర్ణముఖీ నదీ పరివాహక ప్రాంతాలలో అక్రమ నిర్మాణాలు -రెవెన్యూ అధికారులకు తెలిసీపట్టించుకొని వైనం



తిరుపతిరూరల్, నవంబర్ 15 ప్రభాతవార్త: తిరుపతిరూరల్ మండలం భూ ఆక్రమణలు అడ్డాగా మారింది. మండల పరిధిలో ఉన్న డికెటి, అనాధీనం, కాల్వ, నదీపోరంబోకు, కుంటపోరంబోకు, కశంగడ్డ తదితర ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురైతున్నాయి. పుణ్యక్షేత్రమైన తిరుపతికి సమీప ప్రాంతంలో ఉన్న ఖరీదైన ప్రభుత్వ భూములు కబ్జాకు గురైతున్నాయి. మండలంలో ప్రభుత్వ భూములు యదేచ్చగా ఆక్రమణకు గురైతున్నా పట్టించుకునే దిక్కేలేదు. తిరుపతి కలెక్టరేట్‌కు కూతవేటు దూరంలో డికెటి భూములలో ప్లాట్స్‌వేసి దర్జాగా విక్రయిస్తున్నా అడిగే నాధుడే లేదని, ఇదివరకు ఎన్నడు జరగని విధంగా భూ కబ్జాలు ఎక్కువైనాయని మండల ప్రజలు చర్చించుకుంటున్నారు. తిరుపతిరూరల్ మండలంలో ఒకటి, రెండు పంచాయతీలు మినహా అన్ని పంచాయతీలలో స్థానిక నాయకులు భూ ఆక్రమణలకు పాల్పడుతున్నారని బహిరంగ చర్చ నడుస్తుంది. తిరుపతిరూరల్ మండలంలో ప్రభుత్వ భూములు ఆక్రమణ జరుగుతున్నాయని తెలిసీన రెవెన్యూ అధికారులు పట్టించుకోకుండా ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణ బహిరంగంగా వినిపిస్తున్నాయి. ప్రభుత్వ భూములను ఆక్రమణలకు గురికాకుండా పరిరక్షించాల్సిన అధికారులు ఆక్రమణదారులకు కొమ్ముగాస్తూ అండగా ఉండారనే ఆరోపణలు ఉన్నాయి. స్వర్ణముఖీ నదీపరివాహక ప్రాంతంలో ఆక్రమంగా ఇళ్లు నిర్మించుకుని వాటికి కరెంట్ సర్వీసులతో పాటు ఇంటి పన్నులు వేయడం కూడా వెనక అంతర్యం ఎమిటో అర్థం కావడంలేదు. మండలం భూ ఆక్రమణలపై ప్రశ్నిస్తే రెవెన్యూ అధికారులు చెప్పే సమాధానం విడ్డూరంగా ఉంది. ప్రభుత్వ భూములలో నిర్మితమైన అక్రమ నిర్మాణాలకు పంచాయతీ అధికారులు ఎలా ఇంటి పన్నులు వేస్తారండి....కరెంట్ సర్వీసులు కరెంట్ అధికారులు ఎలా ఇస్తారండి అంటూ అవిలాల విఆర్వో చెప్పడం విచారకరం. ప్రభుత్వ భూములలో ఆక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేయాలని స్థానిక విఆర్వో విడ్డూర సమాధానం చెప్పి, అక్రమ నిర్మాణాలకు వత్తాసు పలకడం విస్మయానికి గురిచేసే విషయం. తిరుపతిరూరల్ మండలంలో ఖరీదైన ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురి కాకుండా చూడాలని మండల ప్రజలు కోరుకొంటున్నారు. మండలంలో భూ కబ్జాదారులు పేదల స్వంతింటి కలకు ఏర వేసి నదీపరివాహక ప్రాంతాలలో , డికెటి స్థలాలను అంటగడుతున్నారు. ఇప్పటికైన స్థానిక రెవెన్యూ అధికారులు స్పందించి భూ ఆక్రమణలకు అడ్డుకట్ట వేయాలని ఆయా పంచాయతీ స్థానికులు కోరుకొంటున్నారు.

# వరసిద్ధుని దర్శించుకున్న పలువురు ప్రముఖులు



కాణిపాకం నవంబర్ 15 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి వారిని మంగళవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. రాష్ట్రప్రభుత్వ చీప్ విప్ ఉమారెడ్డి వెంకటేశ్వర్లు, గుంటూరు జిల్లా పొన్నూరు ఎమ్మెల్యే కిల్లారి వెంకట రోశయ్య, తెలంగాణా హౌసింగ్ బోర్డు కార్పొరేషన్ ఛైర్మన్ దామోదర్‌లు మంగళవారం స్వామివారిని కుటుంబసమేత ంగా దర్శించుకున్నారు. ఆలయ ఛైర్మన్ ఎ.మోహన్‌రెడ్డి, ఈఓ రాణాప్రతాప్, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదమండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. అనంతరం శ్రీవీరాంజనేయస్వామి ఆలయం, నవగ్రహ ఆలయంలలో కూడా పూజలు నిర్వహించారు. వారి వెంట చిత్తూరు ఆర్డీఓ రేణుక, ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి, సూపరెంటెండెంట్‌లు కోదండపాణి,శ్రీనివాస్, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ రమేష్, స్థానిక ఎస్సై మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే బాబుకు స్వాత్మానందేంద్ర సరస్వతి ఆశీస్సులు



కాణిపాకం, నవంబర్ 15 ప్రభాతవార్త: విశాఖ శారదాపీఠం ఉత్తరాధికారి శ్రీశ్రీశ్రీ స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామీజీనీ స్థానిక ఎమ్మెల్యే ఎంఎస్.బాబు మంగళవారం కాణిపాకంలో కలసి ఆశీస్సులు అందుకున్నారు. స్వధర్మ వాహిని ప్రచార యాత్రలో భాగంగా సోమవారం కాణిపాకం విచ్చేసిన స్వామీజీ రాత్రి కాణిపాకంలోనే బస చేశారు. ఈసందర్భంగా మంగళవారం దేవస్థానం అతిథిగృహంలో వున్న స్వామీజీని ఎమ్మెల్యే బాబు కలసి ఆశీస్సులు అందుకున్నారు. ఎమ్మెల్యే బాబు ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులు గురించి స్వామిజీకి వివరించి ఆలయ వ్యవస్థలను పటిష్టం చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ ఎ.మోహన్‌రెడ్డి, ఈఓ రాణాప్రతాప్, దేవాదాయశాఖ కాంట్రాక్టర్ శ్రీదర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

# భక్తి శ్రద్ధలతో ఆకాశ దీపం



శ్రీకాళహస్తి,నవంబర్ 15 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయంలో కార్తీక మాసం సందర్భంగా మంగళవారం భక్తి శ్రద్ధలతో ఆకాశ దీపాన్ని ఆవిష్కరించారు.ఉదయం నుంచి ఆలయంలో సామాన్య భక్తులు, మరో వైపు విఐపిల తాకిడి పెరుగుతుంది.కోట మండపం వద్ద స్థానిక మహిళా భక్తులు విశేషంగా హాజరు కాగా అలయాధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. వేదపండితులు వేద మంత్రాలను పఠిస్తుండగా సూపరింటెండెంట్ సురేష్‌రెడ్డి, విజయసారధిలు ఆవిష్కరింపజేసారు. టెంపుల్ ఇన్స్‌పెక్టర్ శ్రీనివాసరాజు, ఇఓ సిసి హరి,పాలమంగళం రవి తదితరులు పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధులపై అప్రమత్తం అవసరం

- వైద్యశాఖ అధికారులతో కలెక్టర్ హరినారాయణన్ సమీక్ష



చిత్తూరు, నవంబర్ 15 ప్రభాతవార్త: సీజనల్ వ్యాధులపై మరింత అప్రమత్తంగా విధులు నిర్వర్తించి వ్యాధులు ప్రబలకుండా పక్కా చర్యలు చేపట్టాలని కలెక్టర్ హరినా రాయణన్ వైద్యశాఖ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో మంగళవారం కలెక్టర్ హరినారాయణన్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఆరోగ్య సేవల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, హెల్త్ మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టం సక్రమంగా అమలు చేయాలని ఆదేశించారు. అలాగే జిల్లాలోని 48 పిహెచ్‌సిలు, 14 అర్బన్ హెల్త్ సెంటర్ల నిర్వహణను మరింత మెరుగుకు చర్యలు తీసుకోవాలన్నారు. వైఎస్ఆర్ సోషల్ యాప్‌లో ఎలాంటి తప్పులు లేకుండా వివరాలను నమోదు చేయాలన్నారు. అలాగే ఎఎన్ఎం యాప్‌లో పెండింగ్‌లో వున్న ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలన్నారు. కాన్పు కోసం వచ్చిన వారి వివరాలను నమోదు చేయడంతో పాటు క్షయ వ్యాధి నివారణకు మెరుగైన చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో 428 ఎంఎల్‌హెచ్‌పిలు వున్నారని వారి సేవలను పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలన్నారు. ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్‌తో సేవలు మరింత మెరుగుపడేలా చూడాల న్నారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహార లోపం వున్న పిల్లలను గుర్తించాలన్నారు. ఈ సమావేశంలో డిఎంహెచ్ఓ డాక్టర్ శ్రీహరి, డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ హరినాధరెడ్డి, జిల్లా క్షయ వ్యాధి నివారణ అధికారి డాక్టర్ రవిరాజు, జిల్లా వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ అధికారి డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి, చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రి సూపరిటెండెంట్ డాక్టర్ అరుణ్‌కుమార్, జిల్లా ఆర్‌బిఎస్‌కె కో-ఆర్డినేటర్ డాక్టర్ సుదర్శన్, ఎస్ఓ రమేష్‌రెడ్డి, ఎపిడమాలజిస్ట్ శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.

## పారదర్శకంగా స్వమిత్ర సర్వే : జాయింట్ కలెక్టర్

చిత్తూరు, నవంబర్ 15 ప్రభాతవార్త: గ్రామాల్లో నిర్వహిస్తున్న స్వమిత్ర(గ్రామకంఠం రీసర్వే)ను పారదర్శకంగా నిర్వహించడానికి చర్యలు తీసుకొంటున్నామని జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. స్వమిత్ర సర్వేపై అమరావతి నుండి మంగళవారం పంచాయతీరాజ్ కమీషనర్ కోన శశిధర్ జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్‌తో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌లో జెసి వెంకటేశ్వర్ మాట్లాడుతూ జిల్లాలో 822 గ్రామాలకు గాను 717 గ్రామాల్లో డ్రోన్ ఫ్లయింగ్ పూర్తి అయ్యిందని వివరించారు. అలాగే 8 గ్రామాల్లో గ్రౌండ్ ట్రూథింక్ పూర్తి చేశామన్నారు. అలాగే ఇప్పటి వరకు 96 గ్రామాలకు సంబంధించి ఓఆర్ఐ షీట్లు రావడం జరిగిందన్నారు. గ్రౌండ్ ట్రూథింక్ జరిగే సమయాల్లో గ్రామ సభలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీ పాల్గొన్నారు.

## అర్బన్ హెల్త్ సెంటర్ల నిర్మాణాలు వేగవంతం

- కమీషనర్లకు కలెక్టర్ హరినారాయణన్ ఆదేశం

చిత్తూరు, నవంబర్ 15 ప్రభాతవార్త: మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాల్టీల పరిధిలో జరుగుతున్న అర్బన్ హెల్త్ సెంటర్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని కలెక్టర్ హరినారాయణన్ మున్సిపల్ కమీషనర్లను ఆదేశించారు. కలెక్టర్ హరినారాయణన్ కలెక్టరేట్ నుండి మంగళవారం జిల్లాలోని మున్సిపల్ కమీషనర్లతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ చిత్తూరు, కుప్పం, పుంగనూరుల్లో ఈ నెలాఖరు నాటికి ఒకొక్క అర్బన్ హెల్త్ సెంటర్ నిర్మాణం పూర్తి స్థాయిలో పూర్తి చేసేలా లక్ష్యం నిర్ధేశించుకొని పనులు చేయాలన్నారు.

# డిప్యూటీ డీఎంహెచ్‌వో ఆకస్మిక తనిఖీ



వడమాలపేట, నవంబరు 15 ప్రభాతవార్త: తిరుపతి డిప్యూటీ డీఎంహెచ్‌వో డా. సుధారాణి వడమాలపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, పాదిరేడు గ్రామంలో జరుగుతున్న లెప్రసీ సర్వేని మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సుధారాణి ప్రజలతో మాట్లాడుతూ కుష్టువ్యాధి ఏ శాపం వల్ల, పాపం వల్ల రాదని, మైక్రోట బాక్టీరియల్ లెప్రసీ కారణం అన్నారు. దగ్గులు, తుమ్ముల ద్వారా ఇది వ్యాపిస్తుందని ఈ వ్యాధి శరీరంలో బయట పడటానికి 5 నుంచి 7 సంవత్సరాల వరకు పట్టవచ్చని శరీరంపై స్పర్శ లేని మచ్చలు కాని, పొడలు కాని, రాగి రంగు మచ్చలు కాని, లావుగా మారిన, నొప్పితోకూడిన నరములు కాని, కాళ్లు లేదా చేతుల్లోని కండరాల్లో బలహీనత, తిమ్మిర్లు, నొప్పి తెలియని పుండ్లు, కళ్లు పూర్తిగా మూసుకోలేక పోవడం, ముక్కు, చెవి, తమ్మెలు మందంగా మారడం, శరీరంపై కాని, చెవి తమ్మెలపై కాని బుడిపెలు ఉండడం, కాలి పాదాలకు ఎండ వేడిమి కాని పదునైన వస్తువుల వలన కలిగే గాయాలు కాని తెలియకపోవడం, నూనె రాసినట్లు, నిగనిగలాడే చర్మం ఉండడం వంటి లక్షణాలు ఏవ ఉన్నా వైద్యులను సంప్రదించాలన్నారు. ఆశా కార్యకర్తలు ఇంటింటికి తిరిగి అవగాహన కల్పిస్తూ కుష్టు వ్యాధి నిర్ధారణకై స్వీయ పరీక్షలు చేయడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమన్నారు. వీటిలో ఏ లక్షణం ఉన్నట్లు అనుమానం కలిగినా అలాంటి వారు ఆశా కర్యకర్త, ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌లకు తెలియజేసి ఆలస్యం చేయకుండా దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి ఉచితంగా మందులు, వైద్యసాయం పొందాలన్నారు. ప్రభుత్వం ఖరీదైన మందులను కుష్టు వ్యాధి నిర్మూలనకై ఉచితంగా అందిస్తోందని తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కాన్పు అయిన తల్లిని, బిడ్డని పరీక్షించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలోకమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ పురుషోత్తంరెడ్డి, సూపర్‌వైజర్లు కామరాజు, చంద్రమోహన్, గౌరి, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఏకం ఆలయంలో ఘనంగా, 'ఉచిత స్వర్ణబిందు ప్రాసన

వరదయ్యపాలెం,నవంబర్15 ప్రభాతవార్త : పిల్లల్లో రోగ నిరోధక శక్తిని పెంచడానికి, జ్ఞాపకశక్తి, శారీరక మానసిక వికాసానికి, లోకా పౌండేషన్ నిర్వా హకులు సామాజిక సేవా ధృక్పదంతో అందిస్తున్న స్వర్ణ బిందు ప్రాసన వరదయ్యపాలెం మండలం బత్తలవల్లంలోని ఏకం ఆలయంలో ప్రతి నెలలాగే ఈనెల ఈరోజు మంగళవారం ఈ స్వర్ణబిందు ప్రాసన ఉచిత పంపిణీ కార్యక్రమానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన వ్యక్తమైంది. మండల పరిసర ప్రాంతాల నుంచి విశేషంగా 500 మందికి పైగా పిల్లలు ఈ స్వర్ణబిందు ప్రాసనను సద్వినియోగం చేసుకున్నారు. ప్రాచీన భారతీయ కశ్యప ఆయుర్వేద శాస్త్రం ప్రకారం తయారు చేసిన ఈ మందును పిల్లల ఉజ్వల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని అదదించాలనేదే తమ ఆశయం అని ట్రస్ట్ వైస్ ప్రెసిడెంట్ లోకేష్ దాసాజీ అన్నారు. ఇదే విధంగా ప్రతినెల పుష్యమి నక్షత్రం రోజున ఈ స్వర్ణబిందు ప్రాసన ఉచితంగా పంపిణీ చేస్తామని,ప్రస్తుతం మందు తీసుకున్న పిల్లలందరూ ప్రతినెలా మందును సేవించాలని వారు కోరారు. రాబోయే నెల అనగా డిసెంబర్ 12 తారీకు సోమవారం పుష్యమి నక్షత్రం రోజున నిర్వహించబడును అని అందరూ పిల్లలతో వచ్చి స్వర్ణబిందు ప్రాసన తీసుకోవాలి ్సందిగా కోరారు.

# పాత్రికేయులు మధుకుమార్ మృతి... పలువురు సంతాపం



పుత్తూరురూరల్, నవంబరు 15 ప్రభాతవార్త: సీనియర్ జర్నలిస్టు పొదలకూరు మధుకుమార్ చెన్నైలోని అపోలో ఆసుపత్రిలో చికిత్సపొందుతూ మంగళవారం తుదిశ్వాస విడిచారు. 10 రోజుల క్రితం పుత్తూరులో రోడ్డుపక్కన మోటార్ సైకిల్‌పై వెళుతుండగా ఆయనను కళాశాలకు వెళుతున్న విద్యార్థుల ద్విచక్రవాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో గాయపడ్డ ఆయనను చెన్నై అపోలో ఆస్పత్రికి తరలించారు. ఆయన ఆరోగ్య పరిస్థితి విషమించడంతో మంగళవారం ఉదయం మృతిచెందాడు. మధుకుమార్ 1982లో పాత్రికేయ వృత్తిలో ప్రారంభించి అంచెలంచెలుగా ఎదుగుతూ ఉదయం, ఆంధ్ర జ్యోతి, వార్త దినపత్రికల్లో తనదైన ముద్ర వేసుకున్నారు. ట్రూ లీడర్‌పెన్ మైండ్ పత్రికలను సొంతంగా నడుపుతూ పలు కథనాలు ప్రచురించారు. న్యాయవాది వృత్తుల కన్నా ఎక్కువ కాలం పాత్రికేయ వృత్తిలో రాణించారు. పలువురికి ఆదర్శనీయంగా ఒక సీనియర్ పాత్రికేయుడుగా ఇతరులకు సలహాలు, వార్తలోని మెళకువలను నేర్పించేవారు. అలాంటి మహోన్నత వ్యక్తి నేడు మన మధ్య లేకపోవడం దిగ్భ్రాంతికి గురి చేస్తుందని పలువురు పాత్రికేయులు పేర్కొన్నారు. మునిసిపల్ ఛైర్మన్ హరి, వైస్ ఛైర్మన్‌లు జయప్రకాష్, శంకర్, పుత్తూరు ఉపాధ్యాయ బృందం, నాయకులు మోహన్‌రెడ్డి, న్యాయవాది రవీంద్ర తదితరులు సంతాపం తెలిపారు.

# 22 వేల మంది దర్శనం: ఐదువేలకు చేరువలో దోష నివారణ పూజలు



శ్రీకాళహస్తి,నవంబర్ 15 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వ రాలయంలో మంగళవారం కూడా రద్దీ తగ్గలేదు. ఓ వైపు వర్షం మరో వైపు తుఫాన్ హెచ్చ రికలు ఉన్నా భక్తులు లెక్క చేయకుండా కదలి తరంగాల్లా కదలి వస్తున్నారు. కార్తీక మాసం శివయ్య దర్శనం శ్రేష్టమని భావించిన భక్తులు కదలి వస్తున్నారు.ఈ నేపధ్యంలో అధికారులు అందించిన సమాచారంమేరకు 22వేల మంది దర్శించుకున్నట్లు ప్రకటించారు.ఈ నేపధ్యంలో రాహుకేతుదోష నివారణ పూజలు కూడా విశేషంగానే జరిగాయి.

**నాలుగువేలు దాటిన రాహుకేతుదోష నివారణ పూజలు:**

శ్రీకాళహస్తీశ్వరాలయానికి మంగళవారం రూ.200 దర్శనం టిక్కెట్లుతో 812 మంది, రూ.50ల దర్శనం టిక్కెట్లలో 1686 మంది రాహుకేతుదోష నివారణ పూజలకు సంబంధించి రూ.500లు టిక్కెట్లు 2682 మంది, రూ.750టిక్కెట్లతో 1447, రూ.1500 టిక్కెట్లు కొనుగోలు చేసిన 327 మంది భక్తులు రూ.2500ల టిక్కెట్లు కొనుగోలు చేసి 323 మంది, రూ.5వేల టిక్కెట్లు 91 కొనుగోలు చేసి పూజలు జరిపించుకున్నారు. కాగా అభిషేకాలు 52 శనీశ్వరాభిషేకాలు,మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాబిషేకాలు 48 శనీశ్వరాభిషేకాలు 02,నిత్యకళ్యాణ సేవల్లో 14 జరిగినట్లు సమాచారం అందించారు. మంగళవారం కూడా ఆది,సోమవారాల్లా రాహుకాలసమయంలో కాలసర్పదోష నివారణ పూజలకు రాహుకాల సమయంలో భక్తులు పోటెత్తారు.

# అర్చక సలహా కమిటికి దీవి అనంతబాబు నియామకం



వాకాడు, నవంబర్ 15, ప్రభాతవార్త : ఆంధ్రప్రదేశ్ అర్చక సమాఖ్య సభ్యులతో దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కమిటీలను నిర్వహించారు. దేవాదాయ ధర్మదాయ శాఖ కమిషనర్ హరి జవహర్ లాల్ ఈ మేరకు అధికార ప్రకటన విడుదల చేసారు. తిరుపతి జిల్లా అర్చక సమాఖ్య ప్రతినిధిగా దీవి అనంతబాబును నియమించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ అర్చక లోకానికి తన వంతు సేవ చేయడానికి అవకాశం కల్పించి, తనను ఎంపిక చేయడానికి సహకరించిన అర్చక సమాఖ్య పెద్దలను, దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులకు కృతజ్ఞతలు తెలియజేసారు. ప్రభుత్వ నిర్ణయాల ప్రకారం 5 లక్షల పై ఆదాయం గల దేవాలయాలకు సంక్షేమ పథకాలువర్తింపుచేయుల 43/10 రిజిస్టర్ నందు అర్చకుల పేర్ల నమోదు, అన్ని పథకాలు, జిల్లాకు సంబంధించిన ప్రతిపాదనలకు సంబంధించి సలహాలు, సూచనలు కమిషనర్‌కు అందజేయాల్సి వుంటుందని తెలిపారు.

# రైలుకిందపడి గుర్తు తెలియని మహిళ ఆత్మహత్య



కుప్పంరూరల్, నవంబర్ 15 ప్రభాతవార్త : కుప్పం రైల్వే స్టేషన్ సమీపంలోని డికెపల్లి వద్ద ఓ గుర్తు తెలియని మహిళ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు గుర్తించామని రైల్వే హెడ్ కానిస్టేబుల్ నాగరాజు తెలిపారు. మృతురాలికి సుమారు యాభై ఏళ్ల వయసు ఉంటుందని మృతురాలు బూడిద రంగు స్వెటర్, ఎరుపు రంగు చీర ధరించి ఉందన్నారు. మృతురాలిని గుర్తించిన వారు రైల్వే పోలీసులను సంప్రదించాలని కోరారు.

# భరతనాట్యంలో హర్షిత ప్రతిభ



శ్రీకాళహస్తి, నవంబర్ 14 ప్రభాతవార్త : పొట్టిశ్రీరాములు విశ్వవిద్యాలయ ఆధ్వర్యంలో తిరుపతిలోని ఎస్వీడ్యాన్స్ అండ్ మ్యూజిక్ కళాశాల నిర్వహించిన రాష్ట్ర స్థాయి భరతనాట్యంలో సర్టిఫికెట్ కోర్సు పరీక్షలు నిర్వహించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారులు ఈపరీక్షల్లో పాల్గొనగా ఇందులో శ్రీకాళహస్తికి చెందిన హర్షిత సూర్యకుమార్ తిరుపతి జిల్లాలోనే 75శాతంపైగా మార్కులు సాధించి ఉత్తీర్ణురాలయి కళాశాలకు, గురువులకు మంచి గుర్తింపు తెచ్చింది. ఈసందర్భంగా ఎస్‌వి డ్యాన్స్ అండ్ మ్యూజిక్ కళాశాల భరతనాట్య ఉపాధ్యాయులైన గురువు రవిసుబ్రమణ్యం మరియు శాంతిలక్ష్మి వద్ద శిక్షణ పొందింది. తల్లిదండ్రులు ప్రోత్సాహంతో గురువుల ఆశీర్వాదంతో మంచిమార్కులతో ఉత్తీర్ణురాలయ్యానని హర్షిత సంతోషం వ్యక్తం చేసింది.ఈసందర్భంగా పలువురు హర్షితను అభినందించారు.

# కుప్పంలో అధిక ధరలకు స్టాంప్ పేపర్ల విక్రయాలు

- ప్రశ్నిస్తే కృత్రిమ కొరత సాకు..

కుప్పంరూరల్, నవంబర్ 15 ప్రభాతవార్త : వివిధ రకాల రిజిస్ట్రేషన్లు, డాక్యుమెంట్లు రూపొందించేందుకు అవసరమైన బాండ్ పేపర్లను కుప్పం పట్టణంలో ఉన్న పలువురు స్టాంప్ వెండర్లు అధిక ధరలకు విక్రయిస్తూ ప్రజలను దోచుకుంటున్నారు. వీరిపై ఎలాంటి పర్యవేక్షణ లేకపోవడంతో ఇష్టారాజ్యంగా విక్రయాలు చేస్తున్నారని ప్రజలు వాపోతున్నారు. 10రూపాయల స్టాంప్ పేపరు రూ 30లకు, 20రూపాయల పేపరు 50రూ., 50రూపాయల పేపరు 100రూ, 100రూ.ల పేపరు రూ 200లకు విక్రయిస్తున్నారు. ఇదేంటని అడిగితే స్టాంప్ పేపర్లు ఎక్కడా లభించడం లేదని అవసరం ఉంటే తీసుకో లేదా వెళ్లు అని స్టాంప్ వెండర్లు పేర్కొంటున్నట్లు ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక చేసేది లేక తమ అవసరాల దృష్ట్యా స్టాంప్ పేపర్లకు అధిక ధరలు చెల్లించి కొనుగోలు చేయాల్సిన దుస్థితి ఏర్పడుతోంది. ఇటీవలి కాలంలో కొంతమేర రియల్ ఎస్టేట్ వ్యాపారం కుప్పం ప్రాంతంలో పుంజుకుంది. ఈ నేపథ్యంలో రోజూ రిజిస్ట్రేషన్లు, అగ్రిమెంట్లు, లీజు డాక్యుమెంట్లు తదితరాలు జరుగుతున్నాయి. వీటికి తప్పక స్టాంప్ పేపర్ల అవసరం ఉంది. ఈ నేపథ్యంలో స్టాంప్ పేపర్లకు స్థానికంగా ఉన్న కొంతమంది వెండర్లు కృత్రిమ కొరత సృష్టిస్తున్నట్లు విమర్శలు సైతం వస్తున్నాయి. ఈ కృత్రిమ కొరత విషయం తెలియని ప్రజలు చేసేది లేక స్టాంప్ వెండర్లు చెప్పిన ధరలకే కొనుగోలు చేయాల్సిన దుస్థితి నెలకొంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కుప్పంలో స్టాంప్ పేపర్ల విక్రయాలు నిర్ణీత ధరలకే విక్రయించేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

# ఉల్లాసంగా, ఉత్సాహంగా జిల్లా స్థాయి యువజనోత్సవం

తిరుపతి (క్రీడ), నవంబర్ 15 ప్రభాతవార్త : ఉల్లాసంగా, ఉత్సాహంగా జిల్లా స్థాయి యువజనోత్సవం జరిగినట్లు సెట్విన్ సిఈఓ మురళీ కృష్ణ పేర్కొన్నారు. శ్రీ వివేకానంద స్వామి జయంతి సందర్భంగా జాతీయ స్థాయిలో జరిగే యువజనోత్స వంలో పాల్గొనేందుకు రాష్ట్ర స్థాయిలో పోటీల నందు అర్హత కోసం జిల్లా స్థాయి యువజనోత్సవం సాంస్కృతికపోటీలు సెట్విన్ ఆధ్వర్యంలో శ్రీ వెంకటేశ్వరసంగీత, నృత్య కళాశాల నందు ఉదయం నుంచి సాయంత్రం వరకు అట్టహాసంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపకులపతి కె.రాజా రెడ్డి మాట్లాడుతూ సెట్విన్ యువజన సర్వీసుల శాఖ నిర్వహిస్తున్న యువజనోత్సవ కార్యక్రమాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం మేయర్ శిరీష మాట్లాడుతూ మనిషి ఆరోగ్యవంతుడుగా ఉండడానికి సంగీతం ఎంతో ప్రాముఖ్యమైందని తెలియజేసారు. 23వ వార్డు కార్పొరేటర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మన భారత దేశంలో అంతరించి పోతున్న విలువ అయిన ప్రాముఖ్యమైన సంస్కృతిని వెలికి తీసే భాగంలో ఈ కార్యక్రమం ఎంతగానో దోహదమవుతుందని, మన యాంత్రికమయిన జీవన విధానంలో ఎంతో ఉల్లాసం, ఉత్సాహం కలిగించేది సంగీతమని అడిగింటి పోతున్న, మరిచిపోతున్న జానపద గేయాలు, కళలు వెలుగులోని తీసుకుని కార్యానిర్వహక సభకు మదు మాట్లాడుతూ స్వామి వివేకానంద స్ఫూర్తి యువతను ప్రోత్సహిస్తూ వారిని మంచి గుణవంతులుగా, సంఘ సంస్కర్తలుగా తీర్చిదిద్దడంలో యువజనోత్సవాలు ఎంతో కీలకము అని తెలిపారు. జిల్లా నలుమూలల నుండి విచ్చేసిన యువ కళాకారులు 18 సాంస్కృతిక పోటీలలో పాల్గొని రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సంపాదించాలని అంతేగాక అదనపు పోటీలలో కూడా రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సంపాదించాలని తెలిపారు. శ్రీ వెంకటేశ్వర సంగీత మందిరం ప్రిన్సిపల్ సుధాకర్ మాట్లాడుతూ సెట్విన్ యువజన సర్వీసుల శాఖ వారు ప్రతి ఏడాది నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం జిల్లాలోని యువతి యువకులు మాత్రమే కాకుండా మా కళాశాల విద్యార్థి విద్యార్థులకు రాష్ట్ర స్థాయి జాతీయ స్థాయి గుర్తింపు లభించినదని తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయ నిర్ణేతలు, సెట్విన్ మేనేజర్ కె.మోహన్ కుమార్, జిల్లా క్రీడా సాధికారిక సంస్థ కార్యాలయపు సిబ్బంది, జిల్లాలోని యువ కళాకారులు, యువజన సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# హుసేన్ సాగర్ తరహాలో వినాయక సాగర్

నగర పాలక సంస్థ డిప్యూటి మేయర్ డా. శిరీష

తిరుపతి కార్పొరేషన్, నవంబర్ 15, ప్రభాతవార్త : హుసేన్ సాగర్ తరహాలో వినాయక సాగర్‌ను తీర్చిదిద్దాలని సాగర్ పనులు త్వరగా పూర్తి చేసి ప్రారంభోత్సవాలనికి సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. నగర పాలక సంస్థ మేయర్ డాక్టర్ శిరీష, ఇంజనీరింగ్ అధికారులతో కలిసి మంగళవారం వినాయక సాగర్ వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. స్మార్ట్ సిటీలో భాగంగా బొంతాలమ్మ ఆలయం వద్ద గల వినాయక సాగర్ అభివృద్ధి పనులను పరిశీలించారు. హుస్సేన్ సాగర్ తరహాలో వినాయక సాగర్ అభివృద్ధి ధీటుగా ఉండాలని, వినాయక సాగర్ పనులు త్వరగా పూర్తి చేయడం కోసం ఎక్కువ మంది మనుషులను పెట్టితే పనులు తొందరగా పూర్తవుతాయని, డిసెంబర్‌లో అందుబాటులోకి ఎక్కువ మంది మనుషులను పెడితే పనులు తొందరగా పూర్తవుతాయని, డిసెంబర్‌లో అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. డివైడర్‌లో అందమైన చెట్లు ఉండాలని, అలాగే సాగర్ గట్టు చుట్టూ చదును చేసి ప్లాన్ ప్రకారం చెట్లు, పచ్చటి గడ్డి లాన్ ఏర్పాటు చేయాలన్నారు. చుట్టూ లైటింగ్ ఏర్పాటు చేయాలని, సందర్శకులకు హోటల్స్, వాకింగ్, సైక్లింగ్‌కు, స్విమ్మింగ్ పూల్‌కు వీలుగా ఏర్పాట్లు చేయాలన్నారు. పనులు వీలైనంత త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. చుట్టూ పచ్చని చెట్లను పెంచడం ద్వారా మరింత అందంగా ఉంటుందని తెలియజేసారు. డిసెంబర్ మొదటి వారం లోపల పనులు పూర్తి చేయించాలని ఇంజనీరింగ్ అధికారులకు, కాంట్రాక్టర్లకు మేయర్ శిరీష ఆదేశించారు. అనంతరం కరకంబాడి రోడ్డు, బొంతాలమ్మ గుడి సమీపంలో నిర్మిస్తున్న షాపింగ్మాల్‌ని పరిశీలించి త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. తిరుపతి నగర పాలక సంస్థ కౌన్సిలర్స్ ఏర్పాటు అయినప్పటి నుండి నగరంలో అభివృద్ధి పనులు సెరవేగంగా జరుగుతున్నదని అందులో భాగంగా షాపింగ్ కాంప్లెక్స్ కూడా పూర్తి చేసి త్వరలో అందుబాటులోకి తీసుకొసాతమని తెలియజేసారు. తిరుపతి శాసన సభ్యులు భూమన కరుణాకర్ రెడ్డి తిరుపతిని అభివృద్ధి పథంలో పనిచేస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ మోహన్, ఎంఈ చంద్రశేఖర్, కాంట్రాక్టర్లు రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.